తెప్పపై రుక్మిణీకృష్ణుల విహారం




తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి):తిరుమలలో నిర్వహిస్తున్న శ్రీవారి తెప్పోత్సవాల్లో రెండవరోజైన గురువారం రుక్మిణీకృష్ణులు తెప్పపై భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6 గంటలకు రుక్మిణీ సమేత శ్రీకృష్ణుల ఉత్సవమూర్తులను మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో విద్యుద్దీపాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన తెప్పపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, అన్నమయ్య కీర్తనల ఆలాపనల నడుమ ఉత్సవమూర్తులను తెప్పపై పుష్కరిణిలో మూడుచుట్లు తిప్పారు.శుక్రవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి తెప్పపై దర్శనమివ్వనున్నారు.

మంచి రోజులొస్తాయి

● ధైర్యంగా పనిచేయండన్న లోకేశ్

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తనను కలిసిన పార్టీ నాయకులతో ఆప్యాయంగా మాట్లాడారు. తిరుమలలోని గాయత్రి సదన్ అతిథిగృహం వద్దకు బుధవారం రాత్రి చేరుకున్న ఆయన అక్కడున్న కార్యకర్తలతో మాట్లాడారు. దాదాపు 15 నిమిషాలు బయటే నిలబడి కార్యకర్తలతో ఫొటోలు దిగారు.గురువారం కూడా శ్రీవారి దర్శనానంతరం తనను చూసేందుకు వచ్చిన నాయకులతో, కార్యకర్తలతో కొంతసేపు మాట్లాడారు. 'ఎలా ఉన్నారు, మంచి రోజులు వస్తాయి, ధైర్యంగా పనిచేయండి' అని సూచించారు.చూడ్డానికి వచ్చిన ఎన్టీ రామారావు వీరాభిమాని, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు ఎన్టీఆర్ రాజును (రామచంద్రరాజు)ను ఆరోగ్యం ఎలా వుందంటూ పరామర్శించారు.ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, అనురాధ, టీడీపీ అసెంబ్లీ అభ్యర్థులు అమరనాథ రెడ్డి, జగన్మోహన్, మురళీమోహన్, ఆదిమూలం, పార్టీ నాయకులు నరసింహయాదవ్,పులిగోరు మురళి, ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, జేబీ శ్రీనివాస్,రవినాయుడు, శ్రీధర్‌వర్మ, రాజు యాదవ్, కేశవులు, శివషణ్ముగం, దేవ, బాలాజి, విశ్వ, అంజి తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయం ముందు కుటుంబంతో లోకేశ్

తిరుపతిపై తొలగని సస్పెన్స్

మీరు గెలుపు కోసం పనిచేయండి! అభ్యర్థి సంగతి అధ్యక్షుడు చూసుకుంటారు!!

తిరుపతి జనసేన నేతలతో నాగబాబు



నాగబాబును సన్మానిస్తున్న జనసేన నేతలు

తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన సీటు గెలుపు కోసం మీరు పనిచేయండి... అభ్యర్థి సంగతి అధ్యక్షుడు పవన్ చూసుకుంటారు... అంటూ తిరుపతి జనసేన నాయకులకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సాయంత్రం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆయన తిరుపతి నాయకులతో సుదీర్ఘంగా సమావేశమయ్యారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఈ సందర్భంగా పలువురు నాయకులు తిరుపతిలో నెలకొన్న పరిస్థితులను నాగబాబు దృష్టికి తీసుకెళ్లారు. నగర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ అర్ధరాత్రి అయినా కార్యకర్తలకు అండగా నిలిచే నేతకు టికెట్ ఇవ్వాలని కోరారు. ఆయనతో పాటు పలువురు నాయకులు బయటి వారికి టికెట్ ఇస్తే తిరుపతి ప్రజలు ఆమోదించే పరిస్థితి లేదన్నారు. పార్టీ అభ్యర్థి తమను ఇంతవరకూ కలవలేదని, కార్యక్రమాల గురించి సమాచారం కూడా ఇవ్వడం లేదని మహిళా నేతల్లో సుభాషిణి ఫిర్యాదు చేయగా కీర్తన మాత్రం పార్టీ అభ్యర్థి మంచివారని, తిరుపతిలో లోకల్, నాన్ లోకల్ అన్న వాదన అర్థరహితమన్నారు. అత్యధికులు అభ్యర్థిగా స్థానికులకు అవకాశం ఇవ్వాలని కోరగా కొందరు పార్టీ ఎవరికి ఇచ్చినా పనిచేస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందడం లేదని జిల్లా అధ్యక్షుడు డాక్టర్ హరిప్రసాద్ ఫిర్యాదు చేశారు. స్థానికుల్లో పోటీ చేయడానికి ఎవరు ఆసక్తిగా వున్నారని నాగబాబు ప్రశ్నించడంతో హరిప్రసాద్, కిరణ్ రాయల్ తాము పోటీ చేసేందుకు ఆసక్తిగా వున్నట్టు చెప్పారు. ఎన్నికలను ఎదుర్కొనేందుకు తమకున్న వనరులను కూడా వివరించారు. ఈ ఇద్దరూ కాకుండా ఇతరులెవరైనా వున్నారా అని నాగబాబు ప్రశ్నించగా కొందరు నాయకులు సినీ నిర్మాత ఎన్వీ ప్రసాద్ పేరును ప్రస్తావించారు. కిరణ్ రాయల్ మాట్లాడుతూ ప్రస్తుత అభ్యర్థి తిరుపతిలో గెలిచే అవకాశం లేదని, అతన్నే కొనసాగిస్తే ఓడిపోవడంతో పాటు పార్టీ ప్రతిష్ఠ కూడా దెబ్బతింటుందని స్పష్టం చేశారు. మెజారిటీ నాయకులు అభ్యర్థిని మార్చాలని, స్థానికులైన ఆశావహులతో రీ సర్వే జరిపించాలని కోరగా నాగబాబు పరిశీలిస్తామన్నారు. టీడీపీ నేతల నుంచీ సహకారం అందని విషయంపై టీడీపీ అధిష్ఠానంతో పవన్ కళ్యాణ్ మాట్లాడతారని నాగబాబు హామీ ఇచ్చారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఖచ్చితంగా గెలవాలని, దానికి ఏం చేయాలో చెప్పండని సలహాలు, సూచనలూ కోరారు. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో ఎపిక్ కార్డుల కుంభకోణానికి సంబంధించి వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి పాత్ర ఏమైనా వుందా అన్న విషయమై లోతుగా ఆరా తీయాలని ఆదేశించారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి గెలవాలని, అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాలను గౌరవించాలని ఆయన కోరారు. పార్టీ కోసం పనిచేసే వారిని పేరుపేరునా గుర్తుంచుకుంటామని, వారికి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో అభ్యర్థి విషయంలో తలెత్తిన వివాదంపై పవన్ కళ్యాణ్ టీడీపీ అధినేత చంద్రబాబుతో చర్చిస్తున్నారని వివరించారు. లోకల్, నాన్ లోకల్ సమస్య లేవనెత్తి వైసీపీ ట్రాప్‌లో పడొద్దంటూ ఆయన హెచ్చరించారు. తిరుపతి నేతలతో త్వరలో అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సమావేశమవుతారన్నారు. రాజకీయాల్లో ఎపుడు, ఎవరికి ఏమి జరుగుతుందన్నది చెప్పలేమని, కొన్నిసార్లు త్యాగాలు చేయాల్సి వస్తుందన్నారు. తాను కూడా ఎంపీగా పోటీ చేసేందుకు ఓ నియోజకవర్గంలో కొంతకాలం పని చేశానని, అయితే తర్వాత ఆ నియోజకవర్గం వదులుకోవాల్సి వచ్చిందని స్వానుభవం వెల్లడించారు. పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారని, ఆ స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలబెట్టుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థి విషయం పార్టీ అధ్యక్షుడు చూసుకుంటారని, ఆ విషయం ఆయనకు వదిలిపెట్టి తిరుపతిలో జనసేన గెలించేందుకు కష్టపడి పనిచేయాలని ఆయన తిరుపతి నాయకులను ఆదేశించారు.మంగళగిరి పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 నుంచీ సాయంత్రం 5.30 గంటల వరకూ సమావేశం కొనసాగగా పార్టీ పరిశీలకుడు అజయ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. దీంతో తిరుపతి జనసేన అభ్యర్థిగా అరణి శ్రీనివాసులే కొనసాగుతారా? లేక మార్పు వుంటుందా? అన్నది ప్రస్తుతానికి సస్పెన్స్‌గానే మిగిలిపోయింది. తిరుపతి నాయకులతో త్వరలో పవన్ కళ్యాణ్ సమావేశమయ్యేదాకా అభ్యర్థిపై నెలకొన్న సస్పెన్స్ ఇలాగే కొనసాగే పరిస్థితి కనిపిస్తోంది.

లోకేశ్‌తో ఆరణి భేటీ

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గురువారం ఉదయం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను తిరుమలలో కలిశారు.టీడీపీ నేత కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆయన వెంట వున్నారు. అనంతరం శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు.తిరుపతిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులను లోకేశ్‌కు వివరించా నన్నారు.స్థానిక నేతలతో మాట్లాడి తనకు సహకరించేలా చూడాలని అభ్యర్థించగా ఒకట్రెండురోజుల్లో పరిస్థితులు సర్దుకుంటాయని, జాగ్రత్తగా పనిచేసుకోండని లోకేశ్ సూచించినట్టు చెప్పారు.అనంతరం మరో బృందంగా టీడీపీ నాయకులు ఊకా విజయ్‌కుమార్, నరసింహ యాదవ్, పులిగోరు మురళి, జేబీ శ్రీనివాస్ తదితరులు లోకేశ్‌ను కలిశారు.

పోలీసుశాఖలో 20మందికి ఉగాది పురస్కారాలు

తిరుపతి(విద్య), మార్చి 21: తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన 20 మంది పోలీసు అధికారులు, సిబ్బంది ఉగాది పురస్కారాలకు ఎంపికయ్యారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించిన వారిని ప్రభుత్వం ఏటా ఉగాది పురస్కారాలతో గౌరవిస్తుంది. వివిధ విభాగాల్లో పురస్కారాలకు ఎంపికైన వారు వీరే.

ఉత్తమ సేవా పతకాలు

సీఐ పి.జగన్‌మోహన్ రెడ్డి, తిరుపతి జిల్లా పోలీస్ ట్రైనింగ్ సెంటర్,
ఏఆర్ఎస్ఐ ఎస్ఆర్ ఆంజనేయులు, వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్

కఠిన సేవా పతకం

కానిస్టేబుల్ ఎ.గోపాల్, తిరుపతి టాస్క్‌ఫోర్స్

సేవా పతకాలు

సీఐ కె.బాలయ్య, చిత్తూరు దిశ స్టేషన్
ఆర్ఎస్ఐ బి.లక్ష్మీపతి,వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్
డీఎస్పీ వి.శ్రీనివాసులు, తిరుపతి పీటీసీ వైస్ ప్రిన్సిపాల్
ఆర్ఎస్ఐ ఎం.చిరంజీవులు , తిరుపతి టాస్క్‌ఫోర్స్
ఏఎస్ఐ ఎం.జయచంద్ర శెట్టి, పుంగనూరు
హెడ్‌కానిస్టేబుల్ పి.మోహనయ్య , నింద్ర
హెడ్‌కానిస్టేబుల్ కేఎస్ నరేంద్ర కుమార్,చిత్తూరు ట్రాఫిక్
ఏఎస్ఐ సి.గోపాలరెడ్డి, తిరుపతి ట్రాఫిక్
ఏఎస్ఐ టి.సురేష్‌బాబు , తిరుపతి వెస్ట్
ఏఆర్ఎస్ఐ ఎస్.జయప్రసాద్‌బాబు, తిరుపతి
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.ధనంజయులు, తిరుపతి
ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ కె.శ్రీనివాసులు, తిరుపతి హోంగార్డ్స్ ఇంచార్జి
కానిస్టేబుల్ పి.శారద,ఎయిర్‌పోర్ట్ స్టేషన్, తిరుపతి
కానిస్టేబుల్ ఎం.నందకుమార్, తిరుపతి టాస్క్‌ఫోర్స్

ఉత్తమ సేవాపతకాలు (అగ్నిమాపక శాఖ)

ఫైర్ ఆఫీసర్ కె.శ్యాంబాబు, నాయుడుపేట
లీడింగ్ ఫైర్‌మెన్ వి.ఉమాపతి, పుత్తూరు

స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సేవా పతకం

తిరుమల ఎస్ఐ జె.రామకృష్ణారావు.

ఒకే ఎపిక్ నంబరుతో రెండు జిల్లాల్లో ఓట్లు !



గూడూరు 10వ బూత్ ఓటరు జాబితాలో లక్ష్మీ ప్రసూన



నెల్లూరు రూరల్‌లోని 49వ బూత్ ఓటర్ల జాబితాలో లక్ష్మీ ప్రసూన

గూడూరు, మార్చి 21 : ఓటర్ల జాబితాలో అవకతవకలు ఇంకా బయటపడుతూనే వున్నాయి.తాజాగా ఒకే ఎపిక్ నెంబరుపై రెండు జిల్లాల్లో ఓట్లు నమోదై ఉండడాన్ని గూడూరు పట్టణంలోని వీరారెడ్డిపల్లి 10వ బూత్‌లో టీడీపీ నాయకులు గుర్తించారు. ఈ బూత్‌లో సీరియల్ నంబరు 1347లో ఎపిక్ నంబరు వైఏఈ 2399350పై లక్ష్మి పేరుతో ఒక ఓటు,సీరియల్ నంబరు 1039లో ఎపిక్ నంబరు జీఎల్‌డబ్ల్యు 2879500తో ప్రసూన పేరుతో ఒక ఓటు నమోదై వున్నాయి.నెల్లూరు జిల్లాలోనూ వీరిద్దరూ ఓటర్లుగా నమోదై వున్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వున్న కొత్తూరు ప్రాంతంలోని బూత్ నంబరు 49లోని ఓటర్ల జాబితాలో సీరియల్ నంబరు 1638లో ఎపిక్ నంబరు వైఏఈ 2399350పై లక్ష్మి పేరుతో ,సీరియల్ నంబరు 1644లో ఎపిక్ నంబరు జీఎల్‌డబ్ల్యు 2879500తో ప్రసూన పేరుతో ఓట్లు నమోదైవున్నాయి. ఈ విషయమై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశామని టీడీపీ మాజీ కౌన్సిలర్ ఇశ్రాయిల్‌కుమార్ చెప్పారు.

వైసీపీ సేవలో వలంటీర్

● విధుల నుంచి తొలగింపు



రేణిగుంట, మార్చి 21: వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్న ఒక వలంటీరును ఉద్యోగం నుంచి తొలగించారు. శ్రీకాళహస్తిలోని వైసీపీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రేణిగుంట బుగ్గవీధికి చెందిన వలంటీరు మస్తాన్ ఆ ప్రాంతం నుంచి కొంతమందిని వైసీపీలో చేర్పించారు. అక్కడ దిగిన ఫొటోలు వైరల్ కావడంతో ఎంపీడీవోకు స్థానిక టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో మస్తాన్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఎంపీడీవో విష్ణు చిరంజీవి ఉత్తర్వులు జారీ చేశారు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు, ఆర్టీసీ కండక్టర్




ఆర్వీకండ్రిగలో జరిగిన ప్రచారంలో వలంటీర్లు గీత, లత - వైసీపీ ప్రచారంలో కండక్టర్ మురళి

ఏర్పేడు మండలంలోని రావిళ్లవారికండ్రిగ పంచాయతీలో గురువారం సాయంత్రం జరిగిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో రావిళ్లవారికండ్రిగ పంచాయతీకి చెందిన వలంటీరు కాటా గీత, పెమ్మిగారి లత, శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో కండక్టర్ మురళి పాల్గొనడం చర్చనీయాంశమైంది.

- ఏర్పేడు

తిరుచానూరు ఆలయంలో క్యూకాంప్లెక్సు పనుల ప్రారంభం

● రూ.23 కోట్లతో మూడంతస్తుల భవన సముదాయం ● మాడవీధుల్లో కదిలే వంతెన

తిరుచానూరు, మార్చి 21 : శ్రీవారి దేవేరి పద్మావతీ దేవి కొలువైన తిరుచానూరులో అత్యాధునిక క్యూకాంప్లెక్సు పనులు మొదలయ్యాయి.భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో గత యేడాది ఆగస్టులో టీడీపీ పాలకమండలి రూ.23కోట్ల వ్యయంతో తిరుమల తరహాలో అత్యాధునిక క్యూకాంప్లెక్సు నిర్మాణానికి ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే.గత నెల క్యూకాంప్లెక్సు టెండర్‌ను దక్కించుకున్న కంపెనీ పనులు ప్రారంభించింది. పాత డిప్యూటీ ఈవో కార్యాలయ భవన సముదాయంలో ఈ క్యూకాంప్లెక్సును నిర్మించనున్నారు. ఇందులో భాగంగా మూడు రోజులుగా 0.75ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాత డిప్యూటీ ఈవో కార్యాలయం, కల్యాణమండపం సముదాయాన్ని తొలగిస్తున్నారు. క్యూకాంప్లెక్సు నిర్మాణానికి సుమారు ఏడాదికి పైగా పడుతుందని టీటీడీ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు తెలిపారు. తిరుమల తరహాలో క్యూకాంప్లెక్సులో ప్రవేశించిన భక్తులు అన్ని సేవలూ అక్కడే పొంది ప్రత్యేక క్యూలైను ద్వారా అమ్మవారి దర్శనం చేసుకుని బయటకు వచ్చేలా క్యూకాంప్లెక్సు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.మూడంతస్తులతో క్యూకాంప్లెక్సు నిర్మాణం జరగనుంది. సెల్లార్‌లో లాకర్లు, సెల్ ఫోన్, పాదరక్షల కౌంటర్లు, ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తులకు టికెట్ కౌంటర్లు, సెక్యూరిటీ పాయింట్ వస్తాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో వెయిటింగ్ హాల్, కల్యాణకట్ట రానున్నాయి. ఇంకో అంతస్తులో క్యూలైన్, వెయిటింగ్ హాల్ వస్తాయి.నాల్గవ గేట్ వద్ద నిర్మించనున్న ఈ క్యూకాంప్లెక్సులోకి భక్తులు ప్రవేశించిన తరువాత లగేజీలను అక్కడే భద్రపరచుకుని ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దర్శనానికి వెళతారు. ఇక తిరుమల మాడవీధుల్లో ఉండే మూవింగ్ బ్రిడ్జి తరహాలో కదిలే వంతెనను కూడా పాత పోలీస్‌స్టేషన్ వద్ద నిర్మించనున్నారు. అమ్మవారి ఉత్సవాల సమయంలో వాహనసేవలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్తులు నూతన క్యూకాంప్లెక్సు నుంచి కదిలే వంతెన ద్వారా పుష్కరిణి పక్కనే ఏర్పాటు చేయనున్న క్యూలైను ద్వారా ఆలయం వెలుపల ఉన్న ప్రాకారం గుండా ఇపుడున్న క్యూలైన్‌లోకి ప్రవేశించనున్నారు.

ఎన్నికలంటే అంత చులకనా?

● సమాచార శాఖ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21: 'ఏం తమాషాలు చేస్తున్నారా... ఎన్నికలంటే మీకు అంత చులకనా.. విధుల్లో ఉన్న సిబ్బంది ఎక్కడ' అంటూ కలెక్టర్ లక్ష్మీశ సమాచార శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థుల ప్రచారం, మీడియాకు సంబంధించి నిబంధనల ఉల్లంఘన తదితర అంశాలను పరిశీలించే మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కలెక్టర్ గురువారం రాత్రి తనిఖీ చేశారు. పలువురు సిబ్బంది విధుల్లో కన్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇదేనా మీ పనితీరు' అంటూ కోపోద్రిక్తులయ్యారు. ఇలాగే వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ పనితీరుపైనా ఆయన అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది.

30మందికి షోకాజ్ నోటీసులు

గురువారం జిల్లావ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. తరగతులకు హాజరుకాని 30మంది పీవో, ఏపీవోలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు వారికి షోకాజ్ నోటీసులు పంపించారు. వారినుంచి సంతృప్తికరమైన వివరణ రాకపోతే కఠిన చర్యలు ఉండే అవకాశముంది.



ఎంసీఎంసీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న కలెక్టర్

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం): సా. 6.27
సహరి (శనివారం) : ఉ. 4.56

24న కుప్పానికి చంద్రబాబు

కుప్పం, మార్చి 21: ఈనెల 24, 25 తేదీల్లో టీడీపీ అధినేత చంద్రబాబు కుప్పం నియోజకవర్గ పర్యటన ఖరారైంది. సొంత నియోజకవర్గం నుంచే ఆయన ఎన్నికల ప్రచారం మొదలుపెట్టనున్నారు.కచ్చితమైన షెడ్యూల్ నిర్ధారణ కాకున్నా చంద్రబాబు ఈ రెండ్రోజుల్లో సుడిగాలి పర్యటన చేయనున్నట్లు తెలిసింది. రోడ్ షోలలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నాయి.

17నుంచి కోదండరామాలయ బ్రహ్మోత్సవాలు

చంద్రగిరి, మార్చి 21: చంద్రగిరిలోని కోదండ రామాలయంలో ఏప్రిల్ 17నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.16న అంకురార్పణ,17న ఉదయం 9.05 నుంచి 10గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7.30 గంటల వరకు కోదండరామస్వామి హనుమంత వాహనంపై దర్శనం ఇవ్వనున్నారు. 23న సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తారు. రూ.750 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామివారు భక్తులను కటాక్షించనున్నారు. 25న స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు, చక్రతాళ్వార్‌కు స్నపనతిరుమంజనం, చక్రస్నానం నిర్వహించనున్నారు. సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఏప్రిల్ 26వ తేది ఉదయం 9 నుంచి శ్రీరామపట్టాభిషేకం వైభవంగా నిర్వహించనున్నారు.

యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన

చర్యలు తీసుకోవాలని టీడీపీ డిమాండ్



పాకాలవారిపల్లెలో సీసీ రోడ్డు వేస్తున్న దృశం

చంద్రగిరి, మార్చి 21: చంద్రగిరి మండలంలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను అధికార పార్టీ నాయకులు ఉల్లంఘిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పనపాకం పంచాయతీ పాకాలవారిపల్లెలో గురువారం వైసీపీ నేతలు ప్రభుత్వ అభివృద్ధి పనులు ప్రారంభించారని, పంచాయతీ అధికారులకు సమాచారం లేకుండా వైసీపీ నేతలు బినామీ కాంట్రాక్టర్ల ద్వారా సీసీ రోడ్లు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. దీనిపై ఎంపీడీవో వెంకటసూర్యసాయిని వివరణ అడుగగా పాకాలవారిపల్లెలో సీసీరోడ్ల నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు వచ్చిందని, వెంటనే సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌ను పంపించి ఫొటోలు తెప్పించుకున్నానని తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ రాకముందు ఈ పనులు మంజూరయ్యాయన్నారు.

తూతూమంత్రంగా వాహన తనిఖీలు



పాకావాలరిపల్లె చెక్‌పోస్టు వద్ద వెళుతున్న వాహనాలు

చంద్రగిరి,మార్చి21: చంద్రగిరి మండలం పనపాకం పంచాయతీ పాకాలవారిపల్లె వద్ద పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అయితే వాహనాల తనిఖీలు తూతూమంత్రంగా చేపడుతున్నారు. తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి మద్యం, నగదు ఇతరత్రా వస్తు సామగ్రిని తిరుపతి జిల్లాలోకి అనుమతించకుండా ఉండేందుకు పోలీసులు ఇక్కడ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అయితే ఆ చెక్‌పోస్టులో పోలీసులు వాహనాలు తనిఖీ చేయకుండా టెంట్‌లకు పరిమితం కావడంతో వాహనాలు యథేచ్ఛగా తిరుపతి వైపు దర్జాగా వస్తున్నాయి.

టీడీపీ ఇంటింటి ప్రచారం



చంద్రగిరి, మార్చి 21: తన తండ్రి పులివర్తి నానికి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన తనయుడు పులివర్తి వినీల్ ఓటర్లను అభ్యర్థించారు. గురువారం సాయంత్రం చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లె పంచాయతీలో మీఇంటికి మీపులివర్తి నాని కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్‌తో కలిసి పులివర్తి వినీల్ ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా కార్యదర్శిగా రాజేశ్వరి

చంద్రగిరి, మార్చి 21: వైసీపీ తిరుపతి జిల్లా మహిళా కార్యదర్శిగా చంద్రగిరి పంచాయతీ కోట గ్రామానికి చెందిన గుంటూరు రాజేశ్వరి నియమితులయ్యారు.

తలకోన ప్రాజెక్టును నిర్మించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న తలకోన నీటి సాధన సమితి సభ్యులు

భాకరాపేట, మార్చి 21: తలకోన నుంచి వచ్చే వర్షపు నీటి కోసం ప్రాజెక్టు నిర్మించాలని తలకోన నీటి సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భాకరాపేటలో కరపత్రాలు విడుదల చేసి వారపు సంతలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలాలలో విస్తరించి ఉన్న తలకోన కొండల నుంచి వచ్చే వర్షపు నీరు వృథాగా పోకుండా ఒక రిజర్వాయర్ నిర్మించి కాలువల ద్వారా చెరువులకు అనుసంధానం చేస్తే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. చిన్నగొట్టిగల్లు చెరువు సప్లై ఛానెల్‌కు మరమ్మతులు చేపడితే చెరువు నిండుతుందని, చెరువు నిండితే నాలుగు మండలాల పరిధిలో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో తలకోన నీటి సాధన సమితి ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు, సభ్యులు మురళి, సహదేవయ్య, అంజయ్య, రెడ్డెప్ప, మహేశ్, వెంకటముని, శివ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి



వైసీపీ నాయకులతో మోహిత్‌రెడ్డి సమావేశం

తిరుపతి(రూరల్),మార్చి21: సీఎం జగన్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమపథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు. తుమ్మలగుంటలో గురువారం నియోజకవర్గ వైసీపీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బూత్‌కమిటీలు సమర్థవంతంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రగతి

రామచంద్రాపురం, మార్చి 21: చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని జిల్లా టీడీపీ కార్యదర్శి కె.హరిప్రసాద్ అన్నారు. మండలంలోని యాగప్పరెడ్డి కండ్రిగలో గురువారం బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో నాయకులు సురేంద్రనాయుడు,దినేష్‌నాయుడు, మహేష్, గంగాధరం పాల్గొన్నారు.



యాగప్పరెడ్డి కండ్రిగలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఎన్నికల కోడ్ అమలు ఇదేనా..!





● బడి..గుడి.. వీధిలో అలాగే వదిలేశారు





ఎస్వీనగర్‌గ్రామానికి వెళ్లే ప్రధానకూడలితోపాటు గ్రామంలో పలుచోట్ల ఎమ్మెల్యే పేరిట ఉన్న సిమెంటు బల్లలు - శ్రీనివాసమంగాపురంకి వెళ్లే ప్రధానమార్గంనుంచి పెరుమాళ్లపల్లెకి వెళ్లే కూడలిలో ఎమ్మెల్యే పేరుతో ఉన్న సూచికబోర్డులు

సి.మల్లవరంలో పంచాయతీకార్యాలయంలోని స్కూల్‌ముందు ఉన్న సిమెంటుబల్ల - వేదాంతపురంలోని ఎమ్మెల్యే కార్యాలయం ఎదురుగా రోడ్డుపై వుయ్ సపోర్ట్ మోహిత్ పేరుపై ఉన్న ఫ్లెక్సీ

తిరుపతి రూరల్, మార్చి21: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి ఐదురోజులు గడిచినా తిరుపతి రూరల్ మండలంలో పూర్తిస్థాయిలో కోడ్ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. అధికార వైసీపీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరుపై పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో సిమెంటు బెంచీలతోపాటు పలురోడ్లకు వైఎస్సార్ పేరిట సిమెంటు ఫలకాలపై సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. అయితే కోడ్ అమలులో వచ్చాక పేర్లు కనిపించకుండా చర్యలు చేపట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా బడిలో..గుడిలో..వీధిలో..రోడ్డుకు పక్కనే అందరికీ కనిపించే ప్రదేశాల్లో ఉన్నా వాటిని అలాగే వదిలేశారు. కాగా కొన్ని సిమెంటు బల్లలపై పేర్లు కనపించకుండా కంటితుడుపు చర్యలుగా స్టికర్లను అట్టించి వదిలేశారు. ఇవిప్రజలకు ఉపయోగమే అయినా వీటిపై పెద్ద అక్షరాలతో ఎమ్మెల్యే పేరురాసి ఉంది. దాంతో వీటిని చూసినవారంతా వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని చర్చించుకుంటున్నారు.

గ్రామాల్లో ఇదీ పరిస్థితి..

పెరుమాళ్లపల్లె పంచాయతీపరిధిలో ఎస్వీనగర్‌కి వెళ్లే ప్రధానరోడ్డు మార్గంతోపాటు ఎస్వీనగర్‌లో పలు చోట్ల, కొప్పరవాండ్లపల్లెలో ఇళ్లముందు, గుడిలో ఎమ్మెల్యే పేరుపై తుడా నిధులతో ఏర్పాటు చేసిన సిమెంటు బల్లలు, అలాగే శ్రీనివాసమంగాపురం రోడ్డు నుంచి సి.మల్లవరం వెళ్లే కూడలిలో, సి.మల్లవరంలో గ్రామంలో పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలోని స్కూల్ ముందు ఉన్నవాటిని అలాగే వదిలేశారు. అలాగే రాయల్‌చెరువుకి వెళ్లే ప్రధానరోడ్డు మార్గంలో వేదాంతపురం పంచాయతీలో వైసీపీ ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట రోడ్డుపై మోహిత్ ఫ్లెక్సీని కూడా వదిలేసిన అధికారులు చోద్యం చూస్తున్నారు.



తిరుమల ఆలయంలో ధ్వజస్తంభానికి మొక్కుకుంటున్న నారా దేవాన్ష్



తిరుమల అన్నదాన కేంద్రంలో భోంచేస్తున్న లోకేశ్ కుటుంబం



దేవాన్ష్‌కు కానుక అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు

నారా లోకేశ్‌ను కలిసిన తిరుపతి నేతలు



తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : తిరుమల పర్యటనకు వచ్చిన తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను గురువారం ఆ పార్టీ తిరుపతి నేతలు కలిశారు. ఊకా విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, మహేష్ యాదవ్ శ్రీవారి జ్ఞాపికను అందజేశారు. లోకేశ్ తనయుడు దేవాన్ష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ కుటుంబ సభ్యులు, సింగంశెట్టి సుబ్బరామయ్య, తిరుమల కేశవులు లోకేశ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నేతలు



నాని సమక్షంలో టీడీపీలో చేరుతున్న రణధీరపురం వాసులు

తిరుచానూరు, మార్చి 21: తిరుపతి రూరల్ మండలం సప్తగిరికాలనీ పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు గురువారం చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే పులివర్తి నాని సమక్షంలో టీడీపీలో చేరారు. హెచ్.కిషోర్ రాయల్, వంశీప్రియ, సుమన్, దాము, మహేష్‌తో పాటు 150 వైసీపీ సానుభూతిపరుల కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి నాని పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అలాగే రణధీరపురం పంచాయతీకి చెందిన వెంకటముని, ఓబులేసు, విశ్రాంత సీఐ ప్రసాద్, వెంకటేష్, సూరి తదితరులు కూడా టీడీపీలో చేరారు. నానిని అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామన్నారు.

ఘనంగా జ్ఞానపద వేంకటేశ్వరాలయ ద్వితీయ వార్షికోత్సవం



స్వామి వారికి పట్టు వస్త్రాలు తెస్తున్న గుండాల గోపీనాథరెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21: ఎస్వీయూలోని జ్ఞానపద వేంకటేశ్వర స్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఘనంగా సాగింది. స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి, గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్కిపల్లి మునికృష్ణయాదవ్, జేజిరెడ్డి, శేఖర్, సిద్ధారెడ్డి,సుబ్రమణ్యంరెడ్డి, లక్ష్మి, లలిత, ప్రసాద్, రమేష్ బాబు, నాగరాజుశర్మ, సుబ్రమణ్యంరెడ్డి, తిరుమలయ్య పాల్గొన్నారు.

కవిత్వం పదిమందికి ఉపయోగపడాలి



తిరుపతి (కల్చరల్), మార్చి 21: కవిత్వం పదుగురికీ ఉపకరించేదిగా ఉండాలని శ్వేత సంచాలకులు భూమన్ అన్నారు. గురువారం సాయంత్రం ఎయిర్ బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్లో జరిగిన నాగలి కూడా ఆయుధమే పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కవిత్వం పాఠకుడిని నిద్రపోనీయకూడదని, సమాజ హితం కోసం రాయాలని అన్నారు. కవి కొమ్మవరపు విల్సన్ రావు జీవిత బీమాలో పనిచేయడం వలన ఆయన కవిత్వంలో జీవనసత్యాలు బలంగా ఉన్నాయన్నారు. ఈతరం కవితావేదిక ఆధ్వర్యంలో తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఓఆర్‌ఐ సంచాలకులు ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పుస్తక సమీక్ష చేస్తూ కవిత్వంలో ధ్వని లోతైందన్నారు. విల్సన్ రావు వెలువరించిన పుస్తకంలో సాంద్రత కలిగిన కవిత్వం ఉందన్నారు. సభలో ఇంకా శ్రీపద్మావతి విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షురాలు డాక్టర్ వై.సుభాషిణి, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు, విశ్రాంత పాత్రికేయులు కొత్వాలు అమరేంద్ర, రచయిత కృష్ణస్వామి రాజు ప్రసంగించారు. కవి కొమ్మవరపు విల్సన్ రావు తన స్పందన తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు గార్లపాటి దామోదరనాయుడు, సాకం నాగరాజు, ఆకుల మల్లేశ్వరరావు, పేరూరు బాలసుబ్రమణ్యం, మల్లారపు నాగార్జున, సోము ఉమాపతి, జయరామ్ ప్రసాద్, పలువురు సాహితీప్రియులు పాల్గొన్నారు.

పెంచలకోనకు నేడు చంద్రబాబు

డక్కిలి, మార్చి 21 : తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు శుక్రవారం వెంకటగిరి నియోజకవర్గంలోని రాపూరు మండలంలో వున్న పెంచలకోనలో లక్ష్మీనృసింహుడిని దర్శించుకోనున్నారు.శుక్రవారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో చంద్రబాబు బయలుదేరి 3.15 గంటలకు గోనెపల్లెకు చేరుకుంటారు.అక్కడి నుంచి రోడ్డుమార్గాన పెంచలకోనకు చేరుకుని, లక్ష్మీనృసింహుడిని దర్శనం చేసుకుంటారు. తిరిగి సాయంత్రం 4.30 గంటలకు గోనెపల్లెకు చేరుకుని హెలికాప్టర్‌లో ఉండవల్లికి బయలుదేరి వెళతారు.

ప్రిన్స్ టైలర్ యజమాని అదృశ్యం

షాపు వద్దకు క్యూకడుతున్న బాధితులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 21 : నగరంలోని ప్రిన్స్ టైలర్స్ యజమాని చంద్రశేఖర్ పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రూ.కోట్లలో అప్పులు తీసుకుని పారిపోయినట్లు తెలుస్తోంది. స్థానికులు చెప్పిన వివరాల మేరకు.. వైజాగ్‌కు చెందిన చంద్రశేఖర్ 30 సంవత్సరాల క్రితం తిరుపతికి వచ్చి స్థిరపడ్డాడు. నిమ్మకాయల వీధిలో ప్రిన్స్ టైలర్స్ పేరుతో షాపు ప్రారంభించాడు. మంచి పేరుతెచ్చుకుని బాగా సంపాదించాడు. అనంతరం రియల్ ఎస్టేట్ రంగంలో అడుగుపెట్టాడు. స్నేహితులను నమ్మి మోసపోయాడు. కుమారుడు వాసు హైదరాబాదులో సివిల్స్‌కు ప్రిపేర్ అవుతుండడం, డబ్బులు కట్టాల్సి రావడంతో స్నేహితుల వద్ద అప్పు చేశాడు. వడ్డీ కట్టలేక ఆరేడు నెలలుగా సతమతమవుతూ ఉండేవాడు. ఈ క్రమంలో తిరుపతి నుంచి వెళ్లిపోవాలని భావించి తనను నమ్మిన మరికొందరు పోలీసులు, స్నేహితులు, బంధువుల వద్ద దాదాపు రూ.2 కోట్ల వరకు అప్పులు చేసి పరారయ్యాడు.

వెలుగులోకి వచ్చిందిలా..

చంద్రశేఖర్ 12 రోజుల క్రితమే పరారైనా విషయం వెలుగులోకి రాలేదు. ప్రతినెలా క్రమం తప్పకుండా షాపు అద్దె చెల్లిస్తున్న ఆయన 15 రోజులు కావస్తున్నా ఇవ్వకపోవడంతో దుకాణ యజమాని ప్రభాకర్ రెడ్డి రెండు రోజుల క్రితం దుకాణం వద్దకు వచ్చి చూడగా తాళం వేసి ఉంది. చుట్టుపక్కల విచారించాడు. దాదాపు పది రోజుల నుంచి షాపు తీయడం లేదని చెప్పడంతో తాళాలు పగులగొట్టించాడు. అదే సమయంలో కొందరు బాధితులు అక్కడికి వచ్చి షాపు యజమానికి విషయం చెప్పారు. చివరకు చంద్రశేఖర్ అప్పులు చేసి పారిపోయినట్లు నిర్ధారణకు వచ్చారు.

మఠం భూముల జోలికొస్తే కఠిన చర్యలు

● ఫొటోలు తీసేందుకు వెళ్లిన మా సిబ్బందిపై ఆక్రమణదారుల దాడి

● కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం ● మఠం పరిపాలనాధికారి రమేష్ నాయుడు



తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : హథీరాంజీ మఠం భూముల జోలికొస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేదిలేదని, నిర్మాణాలను తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మఠం పరిపాలనాధికారి రమేష్ నాయుడు తెలిపారు. గురువారం మఠం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తిరుపతి అర్బన్ లెక్కదాఖలా బైరాగపట్టెడ సమీపంలోని ఎంకే నాయుడు కాలనీ వద్ద సర్వే నెంబరు 242/బీలో 9.89 ఎకరాల విస్తీర్ణం గల భూమి హథీరాంజీ మఠానికి చెందింది. ఇందులో 242/బీ/4లో 5.73 ఎకరాలు వ్యవసాయం నిమిత్తం ఎప్పుడో నాలుగు దశాబ్దాల క్రితం మఠం నుంచి లీజుకు పొందిన ఇరువర్గాలు ఈ స్థలం కోసం కొన్నేళ్లుగా న్యాయస్థానాల్లో పోరాడుతున్నాయి. లీజు గడువు తీరిపోవడంతో 2003లో 379 జీవో ప్రకారం కూరపాటి పిచ్చయ్యకు మఠం అధికారులు నోటీసులిచ్చారు. ఆయన తర్వాత కుమారులు ఇందులో ఇంప్లీడ్ కావడంతో మఠానికి, వీరికి న్యాయపోరాటం జరుగుతోంది. ఈ క్రమంలో 2010లో ఒరిజనల్ అప్లికేషన్ (ఓఏ నెం 8/210)తో మఠం ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఇంటీరియం ఉత్తర్వుల మేరకు కేసు పూర్తయ్యేవరకు రూ.11వేలు ఏడాదికి కట్టించుకోమని చెప్పింది. కోర్టు లొసుగులను అడ్డుపెట్టుకుని పెద్దపెద్ద నిర్మాణాలు నిత్యం జరిగిపోతున్నాయి. దీనిపై కోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా ఇరువర్గాలకు స్టేటస్‌కో ఇచ్చింది. స్టేటస్‌కో ఇచ్చిన తర్వాత తుది తీర్పు వచ్చేవరకు నిర్మాణాలు చేపట్టడంకానీ, తాము తొలగించడం కానీ చేయకూడదు. అయినా కోర్టు ఆదేశాలను ధిక్కరించి నిర్మాణాలు కొనసాగుతుండడంతో సాక్ష్యాధారాలతో కోర్టులో సమర్పించేందుకు మా సిబ్బంది ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఈనెల 18న వెళ్లారు. అక్కడ కడపకు చెందిన నవీన్, ఇతరులు కలిసి చీకటి గదిలో వేసి కొట్టారు. మా సిబ్బంది చేతిలో బలవంతంగా రూ.50వేలు నగదు పెట్టి ఫొటోలు తీసుకుని, ఈ విషయం బయటపెడితే కుటుంబంతో సహా చంపుతామని బెదిరించారు. అక్కడ జరిగిన ఘటనపై ఫోన్లో నాకు సమాచారం ఇస్తే పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పాను. వారు భయపడి ఫిర్యాదు చేయలేదు. దీంతో దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వారిద్వారా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. విచారణ జరుగుతోంది. సదరు మఠం భూములను కొందరు పోలీస్ ఉన్నతాధికారులు కొనుగోలు చేసినట్టు సమాచారం ఉంది.వాటిపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నాం. గతంలో ఉన్న మహంతు ఉదాసీనత వలన మఠం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. ఒకవైపు ఆక్రమణకు గురైన వాటిని కాపాడుతుంటే...మరో వైపు ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.' అని తెలిపారు.

అక్రమ మైనింగ్ అడ్డుకుంటే కేసులా?





గుంతలమయమైన అమినిగుంట చెరువు - టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

● స్టేషన్‌లో మూడున్నర గంటలపాటు నిర్బంధించారు

● చౌడేపల్లె టీడీపీ మండలాధ్యక్షుడి ఆవేదన

చౌడేపల్లె, మార్చి 21: అక్రమ మైనింగ్‌ను అడ్డుకుంటే తమపైనే కేసులు పెడతారా.. అని చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి ప్రశ్నించారు. చౌడేపల్లె పోలీస్‌స్టేషన్ వద్ద గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మండలంలోని అమినిగుంట చెరువులో వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మట్టిని అక్రమంగా ఎక్స్‌కవేటర్, మూడు టిప్పర్లతో తరలిస్తుంటే గురువారం సాయంత్రం తాము అక్కడికి వెళ్లి అడ్డుకుని.. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఇంతలా తవ్వేయడానికి ఎవరు అనుమతి ఇచ్చారని, ఇలాచేస్తే భూగర్భ జలాలు అడుగంటి పోతాయి కదా అని శాంతియుతంగా ప్రశ్నించామన్నారు. ఇంతలో సంఘటనా స్థలానికి వచ్చిన పుంగనూరు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తమపై దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. అలాగే తమపై కేసులు పెట్టారన్నారు. పైగా ఫేక్ అనుమతి పత్రాలను చూపి.. 30 అడుగుల లోతువరకు చెరువును తవ్వేసిన వారిని వదిలి.. తమను పోలీస్‌స్టేషన్‌లో మూడున్నర గంటలపాటు నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అక్రమ మైనింగ్‌పై కలెక్టర్ విచారణ చేసి, చెరువుల ఉనికిని కాపాడాలని కోరారు.

అనుమతులు ఉన్నాయి: వైస్ ఎంపీపీ

మట్టి తోలుకోవడానికి ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు ఉన్నాయని వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి తెలిపారు. రైతు నున్న భాస్కర్ పొలానికి మట్టిని తోలుకునేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులకు చలాన్‌కట్టి అనుమతి తీసుకున్నారన్నారు. తాము ఎక్స్‌కవేటర్, టిప్పర్లు అద్దెకు ఇచ్చామని పేర్కొన్నారు. ఈవిషయంపై ఇరిగేషన్ శాఖ డీఈ గిరిని వివరణ కోరగా.. తాము 1500క్యూబిక్ మీటర్లకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

ఆరుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు: ఎస్ఐ

ఆరుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. గురువారం అమినిగుంట చెరువులో ఓ రైతుకు వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి మట్టిని తోలుతుంటే టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, పార్టీ నాయకులు గిరిరాజు, పరమేశం, ఆది, పృథ్వి, ప్రకాష్ వచ్చి అడ్డుకున్నారన్నారు. అక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా వారిని అదుపులో తీసుకుని సెక్షన్ 151 సీఆర్‌పీసీ కింద కేసు నమోదు చేసి సొంత పూచీకత్తుపై స్టేషన్‌బెయిల్ ఇచ్చి పంపినట్లు పేర్కొన్నారు. మట్టిని తోలుతున్నవారు అనుమతి పత్రాలు చూపించారన్నారు. అందులో ఇరిగేషన్ అధికారుల నుంచి 1,500 క్యూబిక్ మీటర్ల మట్టి తోలుకునేందుకు అనుమతి ఉందని తెలిపారు.

తిరుపతి

అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో కోడ్ ఉల్లంఘన



రాజకీయ నాయకుల పేర్లతోకూడిన శిలాఫలకం

తిరుపతి అర్బన్, మార్చి 21 : అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘన స్పష్టంగా కనబడుతోంది. ప్రధాన ద్వారం పక్కనున్న శిలాఫలకంపై రాజకీయ నాయకుల పేర్లు ఉన్నా పట్టించుకోవడంలేదు. వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు దాన్ని చూసి 'ఇక్కడ కోడ్ వర్తించదా' అని చర్చించుకోవడం కనిపించింది.

హెల్ప్'లెస్' సెంటర్



మూసివున్న హెల్ప్‌డెస్క్

తిరుపతి అర్బన్, మార్చి 21: అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ సెంటర్‌ను హెల్ప్‌లెస్‌గా మార్చేశారు. కార్యాలయానికి వచ్చే ప్రజల సహాయార్థం ముఖద్వారం పక్కన హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. అయి తే ఎప్పుడూ మూసి ఉండడంతో ప్రజలకు దాని వల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండడం లేదు. ఈ విషయమై ప్రశ్నిస్తే తమ పనులు ఎక్కడ వాయిదా వేస్తారో అన్న భయంతో ఎవరూ నోరు మెదపడం లేదు. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

ఎమ్మార్పీకే విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రనాయుడు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 21: సెంట్రల్ బస్టేషన్ సముదాయంలోని దుకాణాలలో ఎమ్మార్పీకే విక్రయించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఏటీఎం రామచంద్రనాయుడు హెచ్చరించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో దుకాణదారులతో సమావేశమయ్యారు. పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, శీతల పానీయాలు, తినుబండారాలు, అల్పాహారం, లాకర్స్ వంటి వాటిపై అధిక ధర వసూలు చేసినట్లు తెలిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. దుకాణం ముందు ధరల పట్టిక ప్రదర్శించాలన్నారు. కేటాయించిన స్థలంలోనే వ్యాపారం చేసుకోవాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అతిక్రమించకూడదన్నారు. రాజకీయ పార్టీలతో కలిసి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకూడదని, నేతల బొమ్మలు దుకాణాలలో ఉండకూడదని సూచించారు.

ఆటోడ్రైవర్‌కు రెండేళ్లు జైలు

తిరుపతి (లీగల్), మార్చి 21: స్కూటర్‌ను ఢీకొట్టి ఓ వ్యక్తి మరణానికి కారణమైన మంగళం వినాయకనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ చెరుకూరి ఆదప్పకు రెండేళ్లు జైలుశిక్ష విధిస్తూ ఆరవ అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. 2017 జూన్ 10వ తేదీన రేణిగుంట గంగమ్మగుడి సమీపంలో స్కూటర్‌పై వెళ్తున్న వేణుగోపాలపురానికి చెందిన బి.వేణుగోపాల్‌ను ఆటో ఢీకొంది. తిరుపతి రుయాలో చికిత్స పొందుతూ మరణించాడు. ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని కోర్టులో సాక్ష్యాలు నిరూపణ కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ హేమంత్‌కుమార్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు.

రేపు న్యాయవాదులకు చట్టాలపై అవగాహన

తిరుపతి(లీగల్), మార్చి 21: న్యాయవాదులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు యూత్ హాస్టల్లో నిర్వహించనున్నట్లు న్యాయవాద పరిషత్ రాష్ట్ర కార్యదర్శి వజ్రాల చంద్రశేఖర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, ల్యాండ్ టైటిల్ యాక్ట్‌లపై న్యాయమూర్తుల ద్వారా శిక్షణ ఉంటుందని తెలిపారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, మార్చి21(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 69,072 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,239 మంది తలనీలాలు సమర్పించారు.

రేపటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 21: ఈనెల 24, 25 తేదీల్లో పౌర్ణమిని పురస్కరించుకుని కొండచుట్టు కోసం తిరువణ్ణామలై వెళ్లే భక్తుల కోసం 23వ తేదీ నుంచి మూడు రోజులు ఆర్టీసీ 153 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఈ బస్సులు సెంట్రల్ బస్టేషన్ నుంచి బయలుదేరుతాయని తెలిపారు.

24, 25 తేదీల్లో తుంబురతీర్థ ముక్కోటి

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈ నెల 24, 25 తేదీల్లో తుంబుర తీర్థ ముక్కోటి ఉత్సవం నిర్వహించనున్నారు. తీర్థానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. 24వ తేదీ ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, తిరిగి మరుసటి రోజు ఉదయం 5 నుంచి 11 గంటల వరకు మాత్రమే భక్తులను అనుమతించనున్నారు. పాపవినాశనం డ్యాం వద్ద భక్తులకు అల్పాహారం, అన్నప్రసాదాలు,తాగునీరుఅందిస్తారు.ఎక్కువదూరంనడవాల్సి వస్తుంది కాబట్టి గుండె, శ్వాసకోస సమస్యలు, స్థూలకాయం ఉన్న వారికి అనుమతి లేదని టీటీడీ స్పష్టం చేసింది.

రేపు ఎలక్టోరల్ బాండ్లపై ఆన్‌లైన్ సమావేశం

తిరుపతి(రూరల్), మార్చి 21: భారత గ్రామీణ అధ్యయనం,పరిశోధనా అకాడమీ ఆధ్వర్యంలో శనివారం దేశంలో ఎలక్టోరల్ బాండ్స్-పోల్ ఫండింగ్ పారదర్శకంగా, జవాబుదారీగా ఉందా? అనే అంశంపై ఆన్‌లైన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.సుందర్‌రామ్ పేర్కొన్నారు. భారత ప్రభుత్వ మాజీ ప్రధాన ఎన్నికల అధికారి టీఎస్ కృష్ణమూర్తితోపాటు పలువురు మేధావులు హాజరై ఉపన్యసిస్తారని ప్రకటించారు.

రాయల్‌గా వసూళ్ల దందా

ఒక కార్పొరేటర్ తీరుపై రగిలిపోతున్న జనం



తిరుపతి-ఆంధ్రజ్యోతి

ఆ ప్రాంతంలో ఇల్లు కట్టుకోవాలన్నా ఆ నాయకుడికి కప్పం కట్టాలి. బోరు వేసుకోవాలనుకున్నా సొమ్ములు చెల్లించుకోవాలి. రోడ్డువారన తోపుడు బండ్లు కూడా నెలనెలా ఆయనకు డబ్బు ముట్టజెప్పాల్సిందే. ఇక స్థల వివాదాలు అని తెలిస్తే చాలు పంచాయితీలు చేస్తామంటూ వాలిపోతాడు. అటూ ఇటూ బాదేస్తాడు. ఆ ప్రాంతపు పేదలు నివసించే వాడల్లోని కుర్రకారును పోగేసుకుని హల్‌చల్ చేస్తుంటాడు. నగరంలోని యువనేతకు కుడి భుజం నేనేనంటూ దౌర్జన్యాలకు రాయల్‌గా తెగబడుతూ ఉంటాడు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా జంకూగొంకూ లేకుండానే ఈయన దందా కొనసాగుతోంది. కార్పొరేటర్ పదవితోనే కోట్లకు పడగలెత్తిన ఆ నాయకుడి తీరుకు ఐదేళ్లుగా హడలిపోయిన జనం ఎన్నికలు వచ్చాయిగా ఇక సమాధానం చెబుతాం అంటున్నారు.

● తిరుపతి నగరంలోని తిరుమల బైపాస్ రోడ్డులో చిన్నా చితకా వ్యాపారాలు జోరుగా సాగుతుంటాయి. కపిలతీర్థం దాకా అయితే టిఫిన్ బండ్లు ఇబ్బడిముబ్బడిగా కనిపిస్తాయి. భక్తులకు చవగ్గా వేడివేడి టిఫిన్ వీటిల్లో లభిస్తుంది. బతుకుదెరువు కోసం పేదలు చేస్తున్న ఈ కష్టాన్ని ఒక నాయకుడు దోచుకుంటున్నాడు. వ్యాపారం బాగా జరుగుతోంది కదా.. నెలనెలా కప్పం కట్టమంటూ ఆదేశించాడు. చెల్లించకపోతే మున్సిపల్ సిబ్బంది వాలిపోతారు. నిబంధనలు వల్లెవేస్తారు. తీసేయమంటూ దబాయిస్తారు. దీంతో నెలకు పదివేల రూపాయల దాకా చెల్లించుకుంటున్నారు ఈ ప్రాంతంలోని టిఫిన్ బండ్ల వాళ్లు, ఇతర తోపుడు బండ్ల వాళ్లు.

● ఈయన డివిజన్ పరిధిలో చీమ చిటుక్కుమన్నా వాలిపోతాడు. ఇల్లు కట్టుకున్నా, కమర్షియల్ బిల్డింగ్ నిర్మించినా అంతస్తుకో రేటు నిర్ణయించి వసూలు చేస్తాడు. అడిగినంత ఇవ్వకుంటే అధికారాన్ని అడ్డుపెట్టి పనులకు బ్రేకులు వేస్తాడు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఈయన గుప్పెట్లోనే ఉంటారు. వారిని రంగంలోకి దించేస్తాడు.

● ఈయన కార్పొరేటర్‌గా ఎన్నికైన తీరే వివాదాస్పదం. విపక్ష అభ్యర్థులను నామినేషన్ వేయనీయకుండా అడ్డుకుని దౌర్జన్యపు జెండా ఎగరేసి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యాడు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లు వేయించడంలో చురుగ్గా వ్యవహరించాడు.

● గంజాయి ముఠాలతోనూ మనోడికి మంచి సంబంధాలే ఉన్నాయంటారు. గంజాయితో ఎవరైనా దొరికితే వెంటనే అలిపిరి పోలీస్ స్టేషన్‌లో వాలిపోతాడు. యువనేతకు దగ్గరివాడనే పేరుండడంతో ఎందుకొచ్చిన తలనొప్పి అని పోలీసు అధికారులు కూడా ఆయన చెప్పింది చేసేస్తారన్న పేరుంది.

● వెస్ట్ చర్చి నుంచి పద్మావతీ మహిళా వర్సిటీకి వెళ్లే మార్గంలో ఏ అనుమతులూ లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాడు. అది అక్రమ నిర్మాణమని గతంలో అభ్యంతరపెట్టిన అధికారులు మనోడు కార్పొరేటర్ అయ్యాక మౌనంగా ఉండిపోయారు. ఇంకేం ఆరంతస్థుల భవనాన్ని అలవోకగా పూర్తిచేశాడు. కొలతలేసి పన్నులు వేయడానికి కూడా కార్పొరేషన్ అధికారులు భయపడుతున్నారు.

● శివజ్యోతినగర్లో ఒక స్థల వివాదంలో తలదూర్చి వేసుకున్న షెడ్లను ప్రొక్లెయిన్లతో కొట్టేసి, తిరిగి అదే స్థలంలో వేరే చోట్ల షెడ్లు నిర్మించాడు. ఓరియన్ హోటల్ పక్కన వివాదంలో ఉన్న స్థలంలోకి జొరబడి పంచాయితీ చేసి దండుకున్నాడనే ఆరోపణలున్నాయి. ఆ ప్రాంతంలో కొత్తగా ఏ హోటల్ వెలిసినా మన వసూల్ రాజాకు కప్పం చెల్లించుకోవాల్సిందే అని ప్రచారం.

● తన డివిజన్ పరిధిలోని ఓ ప్రైవేట్ స్థలంలో కార్పొరేషన్ నిధులతో దౌర్జన్యంగా సీసీ రోడ్డు నిర్మాణం చేయించాడు. దీనిమీద చివరికి కోర్టు నుంచి అధికారులకు అక్షింతలు పడ్డాయి.

● తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రకాశం పార్కు ఎదురుగా ఓ భవనాన్ని రాత్రి సమయంలో ప్రైవేట్ వ్యక్తులతో కూల్చేందుకు ప్రయత్నించడంలో ఇతనే ప్రధాన పాత్రపోషించి, భయాందోళనలు సృష్టించాడు.

● ఈ ప్రాంతంలో టీడీపీకి అనుకూలంగా ఉన్నాడన్న కారణంతో ఒక టీ షాపు నిర్వాహకుడిపై తన అనుచరులతో దాడి చేయించాడని చెబుతారు.

వినాయకసాగర్ తూమును పూడ్చేస్తున్నారు

● వర్షాలు వస్తే నీరెళ్లే దారేది..?



వినాయకసాగర్ కట్టకు తూర్పు దిశగా ఉన్న తూము - తూమును పూడ్చేందుకు తోలిన మట్టి

తిరుపతి (జీవకోన), మార్చి 21: నగర పరిధిలోని వినాయకసాగర్ తూర్పు దిశగా ఉన్న తూమును పూడ్చివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వర్షాలు వచ్చి వినాయకసాగర్ నిండితే ఆ తూము ద్వారా నీరు బయటకు వెళుతుంది. ఆ నీటిని దిగువ భాగంలో ఉన్న పంట పొలాలకు ఉపయోగించుకునేవారు. ప్రస్తుతం వినాయకసాగర్‌ను నూతన హంగులతో తీర్చిదిద్దారు. కట్టను పటిష్ఠం చేశారు. ఇక్కడి నుంచి విడుదలయ్యే నీరు తూము ద్వారా తూర్పు దిశగా వెళుతుంది. ఆ దిశగా ఎక్కువగా ప్రైవేటు భూములున్నాయి. ఆ భూముల యజమానులు తూమును ఎలాగైనా పూడ్చివేసి, రోడ్డు నిర్మించుకుంటే తమ భూములకు మరింత ధర వస్తుందనే ఉద్దేశంతో ప్రయత్నాలు ప్రారంభించారు. నీరు వెళ్లే కాలువను చదును చేసేశారు. తూమును మట్టితో పూడ్చే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ ప్రయత్నం కొనసాగితే భవిష్యత్తులో వర్షాలు కురిస్తే తూముగుండా నీరు బయటకు రావడానికి ఇబ్బందికరంగా మారుతుంది. సంబంధిత అధికారులు స్పందించి దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

కబడ్డీ పోటీల్లో మూడో స్థానంలో తిరుపతి సర్కిల్ జట్టు

తిరుపతి సెంట్రల్, మార్చి 21 : రాష్ట్రస్థాయి విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీల్లో భాగంగా తిరుపతి సర్కిల్ జట్టు తృతీయ స్థానంలో నిలిచిందని జట్టు మేనేజరు టి.జయరామ్ తెలిపారు. ముద్దనూరులో మూడు రోజులపాటు కబడ్డీ పోటీలు జరిగాయని, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి సర్కిల్ జట్లు మొదటి మూడు స్థానాలు సాధించాయని చెప్పారు. తిరుపతి సర్కిల్ జట్టు సభ్యులను స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వాసుదేవ రెడ్డి, సర్కిల్ కార్యదర్శి పురుషోత్తం, కోశాధికారి లీలారామ్ అభినందించారు. ఉత్తమ క్రీడాకారుడిగా తిరుపతి సర్కిల్‌కు చెందిన శేషాద్రి ఎంపికయ్యారని తెలిపారు.

రైల్వే జీఎంకు సమస్యల స్వాగతం

తిరుపతి సెంట్రల్, మార్చి 21 : దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్‌కు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. జీఎం మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం తిరుపతికి రానున్నట్లు రైల్వే అధికార వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. ఈసారైనా జీఎం సారు వీటిపై దృష్టి సారిస్తారని అధికారులు, ప్రయాణికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

● రేణిగుంట రైల్వేస్టేషన్ రోడ్డు నెంబరు ఒకటి(ప్లాట్ ఫారం ఒకటి)నుంచి గూడూరు వైపు వెళ్లే రైలు మార్గాన్ని కలుపుతూ చేపట్టాల్సిన అనుసంధానం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తద్వారా ప్లాట్‌ఫారాలు ఖాళీ లేక రాత్రి సమయాల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు గంటల తరబడి పొలిమేరల్లో ఉండాల్సి వస్తోంది. ఇదే అదనుగా రైళ్లలో చోరీలు జరుగుతున్నాయి.

● రేణిగుంట రైల్వేస్టేషన్ దక్షిణం యార్డులో చెన్నై నుంచి రేణిగుంట మీదుగా వెళ్లే ఎన్‌ఎంజీ గూడ్స్ రైళ్లు ఒకే క్రాసింగ్ పాయింట్ వద్ద ఐదు పర్యాయాలు పట్టాలు తప్పినా ఎలాంటి చర్యలూ లేవు.

● రైల్వే గేట్ల స్థానంలో అండర్ బ్రిడ్జిల నిర్మాణం ప్రారంభంకాలేదు.

● తిరుచానూరు రైల్వేస్టేషన్ నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి కనపడుతోంది.

● తిరుపతి పడమటి రైల్వేస్టేషన్ వద్ద అభివృద్ధి పనులు చేపట్టలేదు.

● తిరుపతి స్టేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు రేల్ కళ్యాణ్ మండపం మంజూరు చేయలేదు. వసతి భవనాల ఊసేలేదు.

● మహిళా ఉద్యోగులకు తగిన విశ్రాంతి గదులు ఏర్పాటు చేయడంలో దృష్టి సారించడం లేదు.

అసంపూర్తి రోడ్డును అట్టహాసంగా ప్రారంభించారు



అసంపూర్తిగా కనబడుతున్న నూతనంగా నిర్మించిన రోడ్డు

తిరుపతి (జీవకోన), మార్చి 21: ప్రకాశం పార్కు ఎదురుగా తిరుమల బైపాస్ రోడ్డు నుంచి సత్యనారాయణపురం సర్కిల్ వరకు 30 అడుగులున్న రోడ్డును పది అడుగులు పెంచి (ఉన్న ఇళ్లను కొంత తొలగించి) 40 అడుగుల రోడ్డుగా తీర్చిదిద్దారు. నిర్మాణం ఇంకా పూర్తికాలేదు. ఈ నెల 15న మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ఎంతో ఆర్భాటంగా విరజా మార్గం పేరుతో ప్రారంభోత్సవం చేశారు. సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్ రోడ్డు వరకు 400 మీటర్ల రోడ్డు ఉంటుంది. ఇందులో 360 మీటర్లు మా త్రమే నిర్మించారు. మిగిలిన 40మీటర్లు స్థల వివాదం కారణంగా అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఈ 40 మీటర్లలో కంకర గుల్ల పోశారు. ఇది వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దీనిపైనా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

తిరుమలకు కాలినడకన డీఐజీ



తిరుపతి (నేరవిభాగం), మార్చి 21 : అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి గురువారం సాయంత్రం తిరుమలకు కాలినడకన వెళ్లారు. అలిపిరి మార్గంలో వెళుతూ టీటీడీ, పోలీసులు సంయుక్తంగా తీసుకున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఇటీవల తిరుమలలో బాలుడు కిడ్నాప్‌నకు గురికావడం, చిరుతలు, ఎలుగుబంట్లు సంచారం ఎక్కువ కావడం వంటి వాటిపై ఆరా తీశారు. నడక దారిలోని టీటీడీ, పోలీసు అవుట్ పోస్టు, చెక్ పోస్టులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం తిరుమల పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

23న ఎస్వీయూ పాలకమండలి సమావేశం

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పైనే ప్రధాన చర్చ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21: ఈనెల 23 వ తేదీన ఎస్వీ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం నిర్వహించనున్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుంది. ఎన్నికల నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పైనే ప్రధాన చర్చ సాగనుంది. ఎన్నికల నేపథ్యంలో రాబోయే మూడు నెలలకు యూనివర్సిటీ ఉద్యోగులకు వేతనాలు, రిటైర్డు ఉద్యోగులకు పెన్షన్లు అందించేందుకు అవసరమైన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌కు ప్రతిపాదనలపై చర్చించనున్నారు.

ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 21: ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించిన పీవో, ఏపీవోలకు కచ్చపి ఆడిటోరియంలో శిక్షణా తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసారి ఎన్నికల్లో పలు కొత్త అంశాలు, సూచనలు ఉన్నాయని, హ్యాండ్‌బుక్ చదివి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఇబ్బందులుంటే సంబంధిత సెక్టార్, రిటర్నింగ్ అధికారికి తెలపాలన్నారు. మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ జీఎం స్మార్ట్‌సిటీ తిరుపతి చంద్రమౌళి, ఎస్డీసీ మురళి పీవోలకు శిక్షణ ఇచ్చారు. ఎస్వీ వెటర్నరీ కళాశాలలో చంద్రగిరి నియోజకవర్గ పీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈఆర్వో ఆదితిసింగ్, నోడల్ అధికారులు ప్రతాప్‌రెడ్డి, బాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

మా భూములు కాపాడండి

కోబాక ఎస్టీ కాలనీ వాసుల మొర



మాట్లాడుతున్న గిరిజనులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21: ఆక్రమణకు గురవుతున్న తమ భూములను కాపాడాలని ఏర్పేడు మండలం కోబాక పంచాయతీ ఎరుకుల కాలనీ వాసులు మొర పెట్టుకున్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గురువారం బాధితురాలు జి.రామసుబ్బమ్మ మాట్లాడుతూ తన భర్త ఎం.సుబ్రమణ్యం పేరుతో గ్రామ కంఠం భూమి ఉందన్నారు. తమతో పాటు 15 కుటుంబాలకు చెందిన వారు ఇదే గ్రామ కంఠం భూమిలో నివాసం ఉంటున్నారని చెప్పారు. ఇటీవల మరో మూడు కుటుంబాలు ఇక్కడకు వచ్చి ఈ భూమిని ఆక్రమించాయని ఆరోపించారు. ఆక్రమణదారులు ప్రభుత్వ ఉద్యోగులన్నారు. వారిపై చర్యలు తీసుకుని, తమ భూమిని కాపాడాలని కోరారు. సమావేశంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

21 మంది విద్యార్థి నేతలపై కేసు కొట్టివేత



కోర్టుకు హాజరైన విద్యార్థి నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 21 : ఎస్వీయూలో సమస్యలపై 2017లో చేపట్టిన ఆందోళనలో భాగంగా 21 మంది విద్యార్థి నేతలపై అప్పట్లో కేసు నమోదైంది. దీనిపై విచారించిన తిరుపతి కోర్టు గురువారం ఈ కేసును కొట్టివేసింది. ఈ కేసులో శివారెడ్డి, చలపతి, శశి (ఏఐఎస్ఎఫ్), కత్తి రవి (ఏఐవైఎఫ్), అమృతతేజ, వసీం అక్రమ్ (ఎన్ఎస్‌యూఐ), హరి ప్రసాదరెడ్డి, పోతు మురళీధర్, హేమంత్, సుధీర్ (వైఎస్సార్‌ఎస్‌యూ) ఉన్నారు.

ధైర్యంగా వచ్చి ఓటు వేయండి

తిరుమల స్థానికులతో డీఎస్పీ శ్రీనివాసాచారి



స్థానికులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో ఓటర్లు ధైర్యంగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేయాలని తిరుమల డీఎస్పీ శ్రీనివాసాచారి స్థానికులను కోరారు. తిరుమలలో స్థానికులు నివాసముండే బాలాజీనగర్‌లో సీఐలు విజయ్‌కుమార్, సత్యనారాయణ, ఎస్‌ఐలు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, ఏఎస్ఐ వెంకటముని సిబ్బందితో కలిసి పర్యటించారు. ఓటర్లు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. తగిన భద్రత కల్పించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు.

టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు రూ.20 లక్షల విరాళం



తిరుమల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు గురువారం రూ.20 లక్షలు విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన అగర్వాల్ ఇండెక్స్ పర్సన్స్ సంస్థ ఈ విరాళాన్ని ఇచ్చింది. సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర విరాళాన్ని తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యం



బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాశిం సునీల్‌కుమార్, బీజేపీ, జనసేన నాయకులు

గూడూరు, మార్చి 21: రానున్న ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడం తథ్యమని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక రెండోపట్టణ పరిధిలోని విందూరు రోడ్డులో బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుక బడిందన్నారు. మళ్లీ రాష్ట్రం బాగుపడాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దయాకర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చంద్రప్ప, పాపారెడ్డి పురుషోత్తంరెడ్డి, ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, గిరిరెడ్డి, పనబాక కోటేశ్వరరావు, మనోజ్‌కుమార్, చంద్రమౌళి, రవీంద్రరెడ్డి, తీగల చంద్రశేఖర్, ఇంద్రవర్దన్, నరసింహులు, పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచు రామయ్య, వెంకటేశ్వర్లురాజు, బిందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



ట్యాంకరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

గూడూరు అర్బన్, మార్చి 21: పట్టణంలో నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడం ప్రజలు నీటి కోసం అవస్థలుపడాల్సివచ్చింది. కండలేరు నుంచి గూడూరుకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గురువారం పట్టణంలోని పలు ప్రాంతాలకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా అందించారు.

మున్సిపాలిటీని ముట్టడిస్తాం

పైపులైన్లు త్వరగా బాగుచేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని లేనిపక్షంలో టీడీపీ ఆధ్వ ర్యంలో ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పేర్కొన్నారు. నాలుగు రోజులుగా జనం తాగునీటికోసం అవస్థలు పడుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



చంద్రశేఖరపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

కోట, మార్చి 21 : మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల చంద్రశేఖరపురంలో గురువారం కోటకు చెందిన ప్రగతి డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణంలో విద్యార్థులు పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రంచేశారు. డ్రైనేజీ కాలువల్లో బ్లీచింగ్ చల్లి అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ వెంకయ్య పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



డక్కిలిలో కేంద్ర సాయిధ బలగాలతో కవాతు

డక్కిలి, మార్చి 21 : ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ చౌడయ్య కోరారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం డక్కిలిలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించామన్నారు. డక్కిలి పోలీసుస్టేషన్ నుంచి పాతబస్టాండు సెంటరు, మార్లగుంట వరకు కవాతు సాగింది.

స్త్రీ, శిశు మరణాలు నివారించాలి

బాలాయపల్లి, మార్చి21: స్త్రీ, శిశు మరణాలు తగ్గించడమే పోషణ పక్వాడ ఉద్ధేశమని అంగన్వాడీ పర్యవేక్షకురాలు రాజేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని నాయుడుచెరువు కండ్రిగ గ్రామంలో బాలింతలకు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. పోషకాహారం తీసుకోకుంటే కలిగే నష్టాలను తెలియజేశారు. అనంతరం ఇళ్లలో ఉండే వస్తువులతో పిండి పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శారద తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరగాలి: ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు అర్బన్, మార్చి 21: ఎన్నికలు సజావుగా జరిగేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో నియోజకవర్గ పరిధిలోని ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలన్నారు. మద్యం రవాణా, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేలా వస్తువులు పంపిణీ చేయకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. సిబ్బంది పారదర్శకంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఈ శిక్షణా తరగతులను డిప్యూటీ కలెక్టర్ సీఎస్ నాయుడు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు కరుణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



డక్కిలి, మార్చి 21 : డక్కిలిలో ఏర్పేడు -వెంచలకోన జాతీయ రహదారి మీదుగా వెళ్లే వాహనాలను గురువారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీచేసింది. డక్కిలి సమీపంలోని చెరువు కట్టపై వాహనాలు ఆపి తనిఖీ చేశారు. రూ 50 వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపాలని లేనిపక్షంలో సీజ్ చేస్తామని స్క్వాడ్ అధికారి జగదీష్‌బాబు తెలిపారు.

ఎన్నికలు పక్కాగా నిర్వహించాలి

వెంకగటగిరిటౌన్, మార్చి 21: వచ్చే సార్వత్రిక ఎన్నికలు పక్కాగా నిర్వహించాలని తిరుపతి జిల్లా జేసీ, వెంకటగిరి ఆర్‌వో ధ్యానచంద్ర అన్నారు. గురువారం స్థానిక విశ్వోదయ డిగ్రీ కళశాలలో ఏపీవో, పీవోలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లిలోని 398 మంది పీవోలు, ఏపీవోలైన అధికారులకు శిక్షణ అందించామన్నారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు.

ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

వెంకటగిరిటౌన్, మార్చి 21: ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఫలితంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు పాఠశాలలు నిర్వహించాల్సి వస్తోందన్నారు. అయితే కొన్ని ప్రైవేటు పాఠశాలలు సాయంత్రం 6 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిసిందని అలా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దివ్యాంగుడికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న ప్రకృతికుమార్

వెంకటగిరిటౌన్, మార్చి 21: పట్టణంలోని బంగారు పేటకు చెందిన దివ్యాంగుడైన గౌరబత్తిన వీరభద్రయ్యకు ఏపీపీ ప్రకృతికుమార్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ సోమయ్య ఆర్థిక సాయం అందించారు. ఈ నెల 17న విజయనగరంలో జరిగిన దివ్యాంగుల పారా సిట్టింగ్ వాలీ బాల్ పోటీల్లో వీరభద్రయ్య విజేతగా నిలిచారు. త్వరలో రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొన నున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన్ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రమేష్, మురళి, రాజా పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించండి

బాలాయపల్లి, మార్చి21: ఎన్నికల నియమావళిని సచివాలయ సిబ్బంది కచ్చితంగా పాటించాలని ఎంపీడీవో అరుణ సూచించారు. గురువారం మండలంలోని ఊట్లపల్లి, కోటంబేడు, చిలమనూరు, హస్తకావేరి గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమలు తీరును పరిశీలించారు.

దళిత ద్రోహి జగన్ : టీడీపీ



ఎస్సీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీసాయిప్రియ

వెంకటగిరి, మార్చి 21: వైఎస్.జగన్ దళిత ద్రోహి అని వెంకటగిరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. గురువారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎస్సీల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్సీల ఓట్లతో గద్దెనెక్కిన జగన్ అధికారంలోకి వచ్చాక ఎస్సీలను అన్నివిధాలా ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఎస్సీలకు సంబంధించిన పలు పథకాలు రద్దుచేశార న్నారు. చంద్రబాబు హయాంలోనే ఎస్సీలకు అన్నివిధాలా న్యాయం జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఇంటి బిడ్డగా తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పరసారత్నం నియోజకవర్గ పరిధిలోని వెంకటగిరి పట్టణం, వెంకటగిరి, డక్కిలి, రాపూరు, సైదాపురం, బాలాయపల్లి మండలాల ఎస్సీ సెల్ నాయకులను, కార్యకర్తల, జనసేన పార్టీ నాయకులను ఆమెకు పరిచయం చేశారు. జగన్ ప్రభుత్వంలో ఎస్సీలకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించాలని ఆమె వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నాయకులు శ్రీరామదాసు గంగాధర్, చెంగారావు, మల్లారం బాబు, మచ్చల వేణు, రాపూరు శ్రీనివాసులు, సుధ, రవి, చలపతి తదితరులు ఉన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరును పూర్తిచేయండి



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణను సత్కరిస్తున్న రైతులు

డక్కిలి, మార్చి 21 : వైసీపీ ప్రభుత్వం అర్ధాంతరంగా నిలిపివేసిన ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని అధికారంలోకి రాగానే పూర్తి చేయించాలని ఆల్తూరుపాడు గ్రామ రైతులు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణని కోరారు. టీడీపీ అభ్యర్థిగా లక్ష్మీ సాయిప్రియను ఖరారు చేసిన సందర్భంగా గురువారం వారు ఆమెను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆల్తూరుపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా చెరువు కట్టను పూర్తిగా తొలగించడంతో చెరువులో నీరు నిల్వచేసుకోలేకపోతున్నామని చెప్పారు. ఫలితంగా నాలుగేళ్ల నుంచి పంటలు పండించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే రిజర్వాయరు పనులు మొదలు పెడతామని రామకృష్ణ వారికి హామీ ఇచ్చారు.

ప్రతి ఓటరునూ కలుద్దాం..గెలుద్దాం: టీడీపీ



ఇన్‌చార్జిలతో సమీక్ష నిర్వహిస్తున్న లక్ష్మీ సాయిప్రియ

డక్కిలి, మార్చి 21 : గెలుపే లక్ష్యంగా యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బూత్‌లెవల్లో పనిచేయాలని వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి లక్ష్మీ సాయిప్రియ అన్నారు. గురువారం ఆమె మండలంలోని బూత్ లెవల్ యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె వారికి దిశానిర్దేశం చేశారు. ప్రతి ఓటరును నేరుగా కలిసి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, ఆ పార్టీ నేతల అరాచకాలను వివరించాలని చెప్పారు. కార్యకర్తలే పార్టీకి కొండంత బలమన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పటిష్టంగా ఉందన్నారు. తన తండ్రి రామకృష్ణ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు గుర్తుచేయాలన్నారు. చంద్రబాబు విడుదల చేసిన మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజల్లో విస్తృత ప్రచారం జరగాలన్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం అవుతుందన్నారు. అనంతరం ఆమె గ్రామాల వారీగా పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పప్పు చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ విజయం చారిత్రక అవసరం



నెలవల, వేనాటితో కలిసి మాట్లాడుతున్న అభ్యర్థి విజయశ్రీ

సూళ్లూరుపేట, మార్చి 21: భావి తరాల ఉజ్వల భవిష్యత్తు, రాష్ట్ర ప్రగతి కోసం చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ విజయం చారిత్రక అవసరమని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం అన్నారు. గురువారం సూళ్లూరుపేటలో టీడీపీ అధికార ప్రతినిధి వేనాటి సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో విద్యార్థులను కలిసి విద్యావంతులు, యువత ఆలోచించి రాష్ట్ర భవిష్యత్ కోసం ఓటు వేయాల న్నారు. రాష్ట్రంలో పాలన గాడిలో పడాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నారు. రాక్షస పాలనను అంతం చేసే అవకాశం అందరికీ వచ్చిందని ఈ ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని వేనాటి అన్నారు. జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, బండారు ఆంజనేయులు, మేడా సాయినారాయణ, వేనాటి జనార్థన్ రెడ్డి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

పోలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

సూళ్లూరుపేట, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులు నిర్వహించారు. నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రముని ఆధ్వర్యంలో, నోడల్ అధికారి చెంగయ్య పర్య వేక్షణలో అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్స్ (ఏఎల్‌ఎంటీ) వారిచే పోలింగ్ సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణ ఇచ్చారు. ఉదయం సూళ్లూరుపేట పట్టణం, సూళ్లూరుపేట మండలం, తడ, దొరవారిసత్రం మండలాలు, మధ్యాహ్నం నాయుడుపేట పట్టణం, నాయుడుపేట మండలం, పెళ్ల కూరు, ఓజిలి మండలాలకు చెందిన పోలింగ్ అధికారులతో సహాయ పోలింగ్ సిబ్బందికి ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా ఈవీఎంలపై ప్రాక్టికల్ శిక్షణ కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోపాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, ఎన్నికల డీటీ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మఠం భూముల జోలికొస్తే కఠిన చర్యలు

● ఫొటోలు తీసేందుకు వెళ్లిన మా సిబ్బందిపై ఆక్రమణదారుల దాడి

● కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం ● మఠం పాలనాధికారి రమేష్ నాయుడు



తిరుపతి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : హథీరాంజీ మఠం భూముల జోలికొస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేదిలేదని, నిర్మాణాలను తొలగించడమే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మఠం పరిపాలనాధికారి రమేష్ నాయుడు తెలిపారు. గురువారం మఠం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'తిరుపతి అర్బన్ లెక్కదాఖలా బైరాగపట్టెడ సమీపంలోని ఎంకే నాయుడు కాలనీ వద్ద సర్వే నెంబరు 242/బీలో 9.89 ఎకరాల విస్తీర్ణంగల భూమి హథీరాంజీ మఠానికి చెందింది. ఇందులో 242/బీ/4లో 5.73 ఎకరాలు వ్యవసాయం నిమిత్తం ఎప్పుడో నాలుగు దశాబ్ధాల క్రితం మఠం నుంచి లీజుకు పొందిన ఇరువర్గాలు ఈ స్థలం కోసం కొన్నే ళ్లుగా న్యాయస్థానాల్లో పోరాడుతున్నాయి. లీజు గడువు తీరిపోవడంతో 2003లో 379 జీవో ప్రకారం కూరపాటి పిచ్చయ్యకు మఠం అధికారులు నోటీసులిచ్చారు. ఆయన తర్వాత కుమారులు ఇందులో ఇంప్లీడ్ కావడంతో మఠానికి, వీరికి న్యాయపోరాటం జరుగుతోంది. ఈ క్రమంలో 2010లో ఒరిజనల్ అప్లికేషన్ (ఓఏ నెం 8/210)తో మఠం ఎండోమెంట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఎండోమెంట్ ట్రిబ్యునల్ ఇంటీరియం ఉత్తర్వుల మేరకు కేసు పూర్తయ్యే వరకు రూ.11వేలు ఏడాదికి కట్టించుకోమని చెప్పింది. కోర్టు లొసుగులను అడ్డుపెట్టుకుని పెద్దపెద్ద నిర్మాణాలు నిత్యం జరిగిపోతున్నాయి. దీనిపై కోర్టుకు అప్పీల్‌కు వెళ్లగా ఇరువర్గాలకు స్టేటస్‌కో ఇచ్చింది. స్టేటస్‌కో ఇచ్చిన తర్వాత తుదితీర్పు వచ్చేవరకు నిర్మాణాలు చేపట్టడం కానీ, తాము తొలగించడం కానీ చేయకూడదు. అయినా కోర్టు ఆదేశాలను ధిక్కరించి నిర్మాణాలు కొనసాగుతుండడంతో సాక్ష్యాధారాలతో కోర్టులో సమర్పించేందుకు మా సిబ్బంది ఫొటోలు, వీడియోలు తీసేందుకు ఈనెల 18న వెళ్లారు. అక్కడ కడపకు చెందిన నవీన్, ఇతరులు కలిసి చీకటి గదిలో వేసి కొట్టారు. మా సిబ్బంది చేతిలో బలవంతంగా రూ.50 వేలు నగదు పెట్టి ఫొటోలు తీసుకుని, ఈ విషయం బయటపెడితే కుటుంబంతో సహా చంపుతామని బెదిరించారు. అక్కడ జరిగిన ఘటనపై ఫోన్లో నాకు సమాచారం ఇస్తే పోలీసులకు ఫిర్యాదు చేయమని చెప్పాను. వారు భయపడి ఫిర్యాదు చేయలేదు. దీంతో దేవాదాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి వారిద్వారా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశాం. విచారణ జరుగుతోంది. సదరు మఠం భూములను కొందరు పోలీస్ ఉన్నతాధికారులు కొనుగోలు చేసినట్టు సమాచారం ఉంది. వాటిపైనా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయ నున్నాం. గతంలో ఉన్న మహంతు ఉదాసీనత వలన మఠం ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయి. ఒకవైపు ఆక్రమణకు గురైన వాటిని కాపాడుతుంటే...మరో వైపు ఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి.' అని తెలిపారు.

నెలాఖరులోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ : కమిషనర్



కమిషనర్ జనార్ధన్‌రెడ్డి

నాయుడుపేట టౌన్, మార్చి 21: నాయుడుపేట మున్సిపాలిటీలోని ప్రజలు స్థిరాస్తుల పన్నులు, నీటి కొళాయి పన్నులు మార్చి లోపు చెల్లిస్తే ఎటువంటి వడ్డీలు చెల్లించన క్కరల్లేదని మున్సిపల్ కమిషనర్ జనార్ధన్ రెడ్డి వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆస్తి, కొళాయిలకు సంబంధించి పన్ను బకాయిలు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైక్ నుంచి జారిపడిన మహిళ మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 21 : ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. మేనకూరు గ్రామానికి చెందిన దొరస్వామి - హైమావతి (27) దంప తులు. వీరు తమ చంటిబిడ్డకు ఆరోగ్యం బాగోలేక పోవడంతో ఈనెల 19వ తేదీ మోటారు సైకిల్‌పై నాయుడుపేటకు బయలు దేరారు. నాయుడు పేట సమీపంలో పార్కు వద్ద వెళుతుండగా హైమావతి చీరకొంగు మోటారు సైకిల్ వీలులో చిక్కుకోవడంతో అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. ఆ సమయంలో పాపకు ఎలాంటి గాయాలూ కాలేదు. దొరస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. అయితే హైమావతి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతిచెందింది.

ఆటో - మోటారు బైక్ ఢీ

● కార్మికులకు గాయాలు

కోట, మార్చి 21 : కోట పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డు వద్ద గురువారం ఆటో, మోటారు బైక్‌ఢీ కొన్న సంఘటనలో పలువురు కార్మికులకు స్వల్పగాయాల య్యాయి. క్రాస్‌రోడ్డు నుంచి పలువురు మహిళా కార్మికులు ఓ పరిశ్రమకు వెళ్లేందుకు ఆటోలో గూడూరు వైపు వెళ్తున్నారు. విద్యానగర్ నుంచి మోటారు సైకిల్ ఎదురుగా వచ్చి క్రాస్‌రోడ్డు వద్ద కార్మికులతో వెళ్తున్న ఆటోను ఢీకొంది. ఈ ఘటనలో పలువురు కార్మికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో ముందుభాగం స్వల్పంగా దెబ్బతింది.

రోడ్డుపై ధాన్యం రాశి.. బైక్ బోల్తా ఇద్దరికి గాయాలు

వాకాడు, మార్చి10: రోడ్డుపైనున్న ధాన్యం రాశిపైకి బైకు ఎక్కడంతో అదుపు తప్పింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ పవన్ కుమార్ కథనం మేరకు.. మండలంలోని వడ్డిపాళెం వద్ద రోడ్డుపై గ్రామానికి చెందిన వారు వరిధాన్యం రాశిగా పోసి ఉంచారు. ధాన్యంపై నల్లటి పట్ట కప్పి ఉంచారు. తిరుపతిలోని ఓ ప్రైవేటు పాల డెయిరీలో కృష్ణ, నరేష్ టెక్నీషియన్లుగా పనిచేస్తున్నారు. వీరు గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో కోడివాక గ్రామంలోని ఓ పాల ఉత్పత్తి కేంద్రంలో మెషీన్‌ను బాగుచేయడానికి బయలుదేరారు. రాత్రి కావడంతో వడ్డిపాళెం వద్ద ధాన్యం రాశిని గుర్తించలేకపోయారు. వాహనాన్ని ధాన్యం రాశిపై ఎక్కించేశారు. వాహన అదుపుతప్పడంతో తలకు గాయాలయ్యాయి. వాకాడు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

సూళ్లూరుపేట, మార్చి 21: సూళ్లూరుపేటలోని సూళ్లూరులో గురువారం అపాచి కంపెనీలో పనిచేసే చింతబత్తిన నవ్యశ్రీ (21) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం డొండపాడు గ్రామానికి చెందిన నవ్యశ్రీ తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలోని అపాచి కంపెనీలో పనిచేస్తోంది. సూళ్లూరులో అద్దె ఇంట్లో అదే కంపెనీలో పనిచేసే తన స్నేహితులతో కలిసి ఉండేది. గురువారం ఆమె గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చంద్రబాబును విమర్శిస్తే సహించం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 21 : టీడీపీ అధినేత చంద్రబాబును విమర్శిస్తే సహించబోమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి హెచ్చరించారు. పెళ్లకూరులో గురువారం టీడీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో నిర్వహించారు. ఇందో మురళీకృష్ణారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సొంతపార్టీ నేతలే ఎన్డీసీసీబీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని విమర్శిస్తున్నారని దానిని సరిదిద్దుకోలేక తమ అధినేతను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలు పుణ్య క్షేత్రాల్లా కొలిచే శిరసనంబేడు, రోసనూరు కొండలను వైసీపీ నాయకులు గుల్ల చేశారని విమర్శించారు. కోడ్ అమల్లోకి వచ్చినా ఇసుక, మట్టి, గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగలేదన్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారని దీనిపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. సత్యనారాయణరెడ్డి ఎన్నిఎత్తులు వేసినా ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని అత్యధిక మెజార్టీతో గెలిపించు కుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు తదితరులు ఉన్నారు.

పుత్తూరు వార్తలు

భానుప్రకాష్‌తోనే నగరి అభివృద్ధి



మిట్టపల్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 21: నగరి అభివృద్ధి గాలి భాను ప్రకాష్‌తోనే సాధ్యమని టీడీపీ చిత్తూరు పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి స్పష్టం చేశారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ఒకటవ వార్డు మిట్టపల్లూరులో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో నగరి నియోజకవర్గంలో అభివృద్ధి కన్నా అవినీతి ఎక్కువగా చోటు చేసుకుందని ఆరోపించారు. వైసీపీ విచ్చలవిడి అవినీతి సొమ్ముతో ఎన్నికలకు రానుందన్నారు. ఓటమి భయంతో బీసీలపై దాడులకు తెగబడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రం బాగుపడాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావాలని, నగరి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు పోవాలంటే గాలి భాను ప్రకాష్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని చెప్పారు. ఫలితంగా మెరుగైన సంక్షేమంతో పాటు రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇంటింటా కరపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చొక్కలింగారెడ్డి, నాయకులు ఆర్ముగరెడ్డి, మురుగేష్‌రెడ్డి, బాలాజీ, గోపాల్, గణేష్, మణిరెడ్డి, రాజా పాల్గొన్నారు.

గ్రామజాతర పెద్దకు ఘన నివాళి



వడమాలపేట, మార్చి 21: మండలంలోని ఎస్‌బీఆర్ పురంలో గ్రామజాతర పెద్ద మేకల సుబ్రమణ్యం యాదవ్ అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. ఆయన మృతదేహానికి నగరి టీడీపీ అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్ మణిరాజు మృతుడి కుటుంబానికి రూ.5వేలు వితరణ చేశారు. నాలుగేళ్లుగా గ్రామంలో నిరుపేదలు మృతిచెందితే రూ.5 వేలు తాత్కాలిక సాయం అందిస్తున్న మణిరాజును గాలి భానుప్రకాష్ అభినందించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు పెద్దబ్బ రాజు, శ్యామయ్య, సూర్యకార్యకర్తలు ఉన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్ పాటిల్

గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ తనిఖీలు

రేణిగుంట, మార్చి 21: గాజులమండ్యం పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురువారం సాయంత్రం పోలీస్ స్టేషన్ సిబ్బంది పనితీరును సమీక్షించి పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ఎలాంటి ఘటనలు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందినిఇ ఆదేశించారు. కేఎల్‌ఎం ఆస్పత్రి కూడలిలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకు ముందు ఎస్పీ రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు ఈ కార్యక్రమంలో ఎస్‌బీడీ డీఎస్పీ భాస్కర్, రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్, సీఐలు మల్లికార్జున్, సుబ్బరాయుడు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

అంకాలమ్మ సేవలో ప్రజాప్రతినిధులు

ఏర్పేడు, మార్చి 21: మండలంలోని చిందేపల్లె గ్రామంలో వెలసిన అంకాలమ్మ పరమేశ్వరి అమ్మవారిని గురువారం తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తనయుడు ఆకర్షరెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారికి చింతపాళెం గ్రామానికి చెందిన వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు రమణయ్యయాదవ్, మాజీ ఎంపీటీసీ సుబ్బరత్నమ్మ వెండి కవచాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, నాయకులు కిషోర్‌రెడ్డి, బత్తిశెట్టి, నాగార్జునరెడ్డి, జమల శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, కేశవరెడ్డి, మునికృష్ణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, నచ్చనేరి సర్పంచ్ మునిరెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, అయితేపల్లి గురునాథం, ధను, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఈశ్వరయ్యగ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి అభ్యర్థిత్వంపై పునః పరిశీలన చేయండి

శ్రీకాళహస్తి, మార్చి 21: శ్రీకాళహస్తి అభ్యర్థిత్వంపై పున: పరిశీలన చేయాలని కూటమినేతలు సమావేశంలో చర్చించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో గురువారం మూడు పార్టీల నాయకులు అభ్యర్థిత్వంపై సమావేశం అయ్యారు. ఇందులో భాగంగా టీడీపీ నుంచి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, సత్రవాడ మునిరామయ్య అలాగే జనసేన నియోజకవర్గ ఇంచార్జి వినుత, పలువురు బీజేపీ నాయకులు అభ్యర్థిత్వం మార్పుపై చర్చించారు.

నిత్యావసర సరుకుల వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 21: నిరుపేద కుటుంబానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పూసల వీధి 33వ వార్డు కాలేషా కుటుంబం పేదరికంపై స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన గురువారం ఆ కుటుంబానికి సిపాయి భరోసా కింద 42 రకాల నిత్యవసర సరుకులు అందజేశారు. జనార్ధన్ రావు, అల్తాఫ్, పీఎం చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అందరం కలిసి వైసీపీని గెలిపిద్దాం

కేవీబీపురం మార్చి21: మనమందరం కలిసి మరల వైసీపీని గెలిపించాలని సత్యవేడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ చెప్పారు. గురువారం మండల కేంద్రంలో మండల వైసీపీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయ్య, నందకుమార్, సర్పంచ్ గిరిబాబు, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

గోపాలన్న అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

తొట్టంబేడు, మార్చి 21: టీడీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండని శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి కోరారు. మండలంలోని బసవయ్యపాళెం పంచాయతీలో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలి చలపలతినాయుడు, మాజీ ఎంపీటీసీ వెంకటాచలం, నాయకులు మురళినాయుడు, మునిరాజనాయుడు, ప్రతాప్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, జయచంద్రనాయుడు, ప్రవీణ్‌రెడ్డి, గురప్ప, చిన్న, ధర్మ, జనసేన నాయకులు, కొట్టే సాయి, మహేష్, బాలాజీరెడ్డి, రామకృష్ణనాయుడు, శ్రీదర్‌నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో విద్యార్థి ప్రతిభ



మోనీష్

శ్రీకాళహస్తి, మార్చి 21: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో శ్రీకాళహస్తి మండలం చల్లపాలెంకు చెందిన మోనీష్ అనే విద్యార్థి జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. చల్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న మోనిష్ జాతీయస్థాయిలో 1278వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయురాలు మునిలీలావతి, విద్యా కమిటి సభ్యులు విద్యార్థిని అభినందించారు.

ప్రభాకర్ కుటుంబానికి బృందమ్మ పరామర్శ

ఏర్పేడు, మార్చి 21: మండలంలో టీడీపీ సీనియర్ నాయకుడు, ఆమందూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కన్నవరం ప్రభాకర్ పదిరోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. గురువారం ఆయన కర్మక్రియలు సందర్భంగా వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆమందూరు గ్రామంలో వారి స్వగృహానికి వచ్చి పరామర్శించారు. వారి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

మండలంలోని వికృతమాల గ్రామంలో రెడ్డివారి రాజారెడ్డి భార్య కాంతమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బొజ్జల బృందమ్మ ఆ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబస భ్యులను పరామర్శించారు.

కేంద్రప్రభుత్వ పథకాలను చూసి ఓటెయ్యండి

తొట్టంబేడు, మార్చి 21: కేంద్రప్రభుత్వ పథకాలను చూసి ఓటెయ్యాలని జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి గోపాల్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజు, అయ్యప్ప, తిమిఉల్లాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్‌ని కలసిన ఆదిమూలం



సత్యవేడు, మార్చి 21: శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో తిరుమలకు విచ్చేసిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ని సత్యవేడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిమూలం వెంట ఆయన కుమారుడు, నారాయణవనం జడ్పీటీసీ సుమన్ ఉన్నారు.

ఆదిమూలాన్ని కలిసిన టీడీపీ నాయకులు



ఎమ్మెల్యే ఆదిమూలంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాగలాపురం, మార్చి 21: సత్యవేడు ఎమ్మెల్యే, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేటి ఆదిమూలంను గురువారం సురుటుపల్లి గ్రామ పంచాయతీలోని కస్తూరి నాయుడు కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆగ్రామానికి చెందిన నాగలాపురం మండల యూనిట్ ఇన్‌చార్జి వీసీ.రుద్రయ్య, గ్రామాధ్యక్షుడు మురళీ, ఉమాశంఖర్, జగదీష్ ఎమ్మెల్యే ఆదిమూలంను నారాయణవనంలో కలిసి సన్మానించారు. నారాలోకేశ్ చిత్రపటాన్ని ఆయనకు అందించారు.

సత్యవేడు

సీ విజిల్ యాప్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న నోడల్ అధికారి హరీష్

సత్యవేడు, మార్చి 21: సీ విజిల్ యాప్‌పై ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రటరీలపై ఉందని సత్యవేడు మండల సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్ కోరారు. గురువారం ఎలెక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు అక్షరాస్యత ఎన్నికల ప్రక్రియకు ఓటర్లను సంసిద్ధం చేయడంపై(స్వీప్) పంచాయతీ సెక్రటరీలకు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా నోడల్ అధికారి హరీష్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానాన్ని ఓటర్లకు అందించాలని ఉద్దేశంతో స్వీప్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దీంతో పాటు ఎన్నికల సంఘం తీసుకొచ్చిన సీ విజిల్ యాప్ పై ఓటర్లకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ సెక్రటరీలపై ఉందన్నారు. శిక్షణ కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు ముని రవికుమార్, ప్రకాష్, మాధవి, కుముద, యుగంధర్, లీలామాధవ్, లోకేష్, రమణమూర్తి, జలజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేకు కోడ్ వర్తించదా?



వీఆర్‌కండ్రిగలో ఆర్‌బీకే భవనంపై పార్టీ రంగులు

సత్యవేడు, మార్చి 21: మండలంలోపి వీఆర్‌కండ్రిగ రైతు భరోసా కేంద్రానికి ఎలక్షన్ కోడ్ వర్తించదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వీఆర్‌కండ్రిగ పంచాయతీ భవనంలో నాలుగేళ్ల క్రితం రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రారంభ సమయంలో భవనానికి ప్రభుత్వం అధికార పార్టీ రంగులను వేయడంతో, పార్టీ రంగులను తొలగించాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై ఉన్న రంగులను తొలగించినా, ఇక్కడ మాత్రం తొలగించకుండా అలాగే ఉంచేశారు. అయితే ప్రస్తుతం ఎన్నికల సమయంలో కూడా ప్రభుత్వ భవనంపై పార్టీ రంగులు దర్శనమిస్తుండడం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా సత్యవేడు పట్టణంలో పాలశీతలికరణ కేంద్రంపై ఉన్న భవనంలో ఆర్‌బీకే ఏర్పాటు చేశారు. ఈ భవనానికి కూడ అప్పుడు వేసిన పార్టీ రంగులు ఇంకా దర్శనమిస్తున్నాయి. ఇవేగాక మండల వ్యాప్తంగా పలుచోట్ల అభివృద్ధి పనులకోసం వేసిన శిలాఫలకాలను కప్పాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడంలేదు.

సేవాశ్రమంలో అన్నదానం



వరదయ్యపాళెం, మార్చి 21: వరదయ్యపాళెం మండలంలోని ఎయిమ్ ఫర్ సేవా ఆశ్రమంలో గురువారం కారిపాకం సర్పంచ్ వేనాటి ఆనంద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆశ్రమనిర్వాహకులు సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. ఆనంద్ మాట్లాడుతూ ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్న ట్రస్టు యజమాన్యానికి తన వంతు సహకారాం అందిస్తామన్నారు.

జనసేన నాయకుడికి నివాళి

వరదయ్యపాళెం, మార్చి 21: మండలంలోని బత్తలవల్లం పంచాయతీ చెదులపాకం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు తడ రజని గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న జనసేన వరదయ్యపాళెం మండలాధ్యక్షుడు చిరంజీవి యాదవ్ తడ రజని మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కులశేఖర్‌రెడ్డి, శిరీష, తులసీరామ్, వెంకటేష్, పృథ్వీ, ప్రసాద్, అనిల్, సుభాష్, సతీష్, ఈశ్వర్, నవీన్, వినోద్, గోపి, పచ్చయ్య, చల్లయ్య, రామమూర్తి, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 21: ఈనెల 24, 25 తేదీల్లో పౌర్ణమిని పురస్కరించుకుని కొండచుట్టు కోసం తిరువణ్ణామలై వెళ్లే భక్తుల కోసం 23వ తేదీ నుంచి మూడు రోజులు ఆర్టీసీ 153 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు సీబీఎస్ ఏటీఎం డి.రామచంద్రనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఈ బస్సులు సెంట్రల్ బస్టేషన్ నుంచి బయలుదేరుతాయని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రిపై రాజకీయ చిత్రాలు



శ్రీకాళహస్తి, మార్చి 19: రాజకీయ ఫ్లెక్సీలను పట్టించుకోరా సారు... అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆరు రోజుల క్రితమే ఎన్నికల నియమావళి ప్రారంభమైన విషయం తెలిసిందే. ఎన్నికల అధికారులు స్పష్టమైన ఆదేశాలను కూడా జారీ చేసిన విషయం అందరికీ విధితమే. కానీ శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి గోడలపై రాజకీయ చిత్రాలకు మాత్రం ముసుగు వేయలేదు. నిత్యం ఆస్పత్రికి వచ్చిపోయే ప్రజలు వాటిని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు

టీడీపీలో చేరిన వైసీపీ ఎంపీటీసీ



పార్టీ కండువా వేస్తున్న బొజ్జల బృందమ్మ

తొట్టంబేడు, మార్చి 21: మండలంలోని తాటిపర్తి వైసీపీ ఎంపీటీసీ చెంచులక్ష్మి తమ అనుచరులతో కలిసి గురువారం టీడీపీలో చేరారు. వారికి వారికి బొజ్జల బృందమ్మ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం తాటిపర్తి గ్రామంలో ఎంపీటీసీ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఉమ్మడి ఎమెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి అత్యాదిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజనాయుడు, వెంకటాచలం, శోభన్‌నాయుడు, మునిరత్నం, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో కోడ్ వర్తించదా..?



మూలకండ్రిగ వద్ద జగన్ ఫొటోతో ముద్రించిన హోర్డింగ్

ఏర్పేడు, మార్చి 21: మండలంలో ఎన్నికల కోడ్ అమలుకావడంలేదు. వైసీపీ నాయకుల ఫోటోలతో ఏర్పాటు చేసిన బ్యానర్లను చాలాచోట్ల అధికారులు తొలగించలేదు. ప్రధానంగా పాపానాయుడుపేట, మూలకండ్రిగ ప్రాంతాల్లో వైసీపీ నాయకులు ఇటీవల ఏర్పాటు చేసిన మా నమ్మకం నువ్వే జగన్ బ్యానర్లు,హోర్డింగ్‌లను అధికారులు తొలగించలేదు.

సూపర్‌సిక్స్ పథకాలకు విశేష స్పందన

ఏర్పేడు, మార్చి 21: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలకు ప్రజల్లో విశష స్పందన లభిస్తోంది. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలో టీడీపీ నాయకులు రవికుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికి వె ళ్లి సూపర్‌సిక్స్ పథకాల గురించి గురువారం వివరించారు.

ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి



గోవిందవరంలో ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యకిషోర్

ఏర్పేడు, మార్చి 21: ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ సూచించారు. ఏర్పేడు మండలం గోవిందవరంలో గురువారం రాత్రి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటిఅవాంఛనీయ ఘటనలు జ రిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీరామ శ్రీనివాసులు, ఎస్‌ఐ జిలాని తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు పెట్టిన వ్యక్తికి సహకరించలేం

వరదయ్యపాళెం, మార్చి 21: ఇబ్బందులు పెట్టిన వ్యక్తికి సహకరించలేమని వరదయ్యపాళెం మండల టీడీపీ నాయకులు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు విన్నవించారు. తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరుగుపయనమవుతున్న లోకేశ్‌ను వరదయ్యపాళెం మండల టీడీపీ నాయకులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి కోనేటి ఆదిమూలం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో టీడీపీ నాయకులపై కేసులు పెట్టి వేధించారన్నారు. అలాంటి వ్యక్తికి తాము సహకరించలేమని అభ్యర్థి విషయంలో పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దశరధన్, చలపతినాయుడు, మధునాయుడు, హరినాయుడు, సునీల్, రాజారాం, కుమార్, శివ, అజయ్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

టీసీసీ క్రికెట్ టోర్నమెంటు విజేత తొండూరు



విజేత జట్టు తొండూరు జట్టు సభ్యులు

వరదయ్యపాళెం, మార్చి 21: మండల సరిహద్దులో తడ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న టీసీసీ క్రికెట్ టోర్నమెంటు విజేతగా తొండూరు జట్టు నిలిచింది. ఫైనల్‌కు తడ, తొండూరు జట్లు చేరుకోగా విజేతగా తొండూరు జట్టు నిలిచింది. విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. విజేతకు రూ.30వేలు, రన్నర్స్‌కు రూ.20వేలు, మూడవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తొండూరు సర్పంచ్ ఎలావూరు రమణ, టీడీపీ నాయకుడు విష్ణు, తడ మాజీ సర్పంచ్ జయకృష్ణ, మాధవయ్య, సెల్వం తదితరుల పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

వరదయ్యపాళెం, మార్చి 21: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవలని సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ ప్రతాప్ అన్నారు. మండలంలోని కంచరపాళెం, కారిపాకం గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఏఎస్‌ఐ షణ్ముగం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీలో పీవోలకు, ఏపీవోలకు శిక్షణా తరగతులు



మాట్లాడుతున్న ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి - హాజరైన అధికారులు

ఏర్పేడు, మార్చి 21: ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఏర్పేడు ఐఐటీ ప్రాంగణంలో పీవోలు, ఏపీవోలకు జిల్లాస్థాయి అధికారులు శిక్షణా తరగతులు నిర్వహించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న రేణిగుంట, ఏర్పేడు, తొట్టంబేడు, శ్రీకాళహస్తి రూరల్, శ్రీకాళహస్తి అర్బన్‌లకు సంబంధించి ఎన్నికల్లో పాల్గొనే అధికారులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. శుక్రవారం కూడా శిక్షణా తరగతులు కొనసాగుతాయని ఏర్పేడు తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు తెలిపారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



విశేషాలంకారంలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి, మార్చి 21: ముక్కంటి ఆలయంలో గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం ఆలయ అర్చకులు ముందుగా దక్షిణామూర్తికి వివిధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వర్ణకవచంతో అలంకరించారు. పసుపు వర్ణ పూలు, ముడి సెనగల దండలను భక్తులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు ఘనంగా వీడ్కోలు



విమానాశ్రయంలో లోకేశ్‌కు వీడ్కోలు పలుకుతున్న సుధీర్‌రెడ్డి

రేణిగుంట, మార్చి 21: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు రేణిగుంట విమానాశ్రయంలో టీడీపీ నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం తిరుమల పర్యటన ముగించుకుని రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తున్న అభ్యర్థులు నాయకులు వీడ్కోలు పలికారు. అంతకుముందు టీడీపీ నియోజవకర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ, అల్లుడు సంజీవ్‌తో కాసేపు మాట్లాడారు. విమానాశ్రయం వెలుపల ఎస్‌ఆర్‌పురం మాజీ ఎంపీటీసీ ఆధ్వర్యంలో వైసీపీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు మాజీ ఎంపీటీసీలు, ఎస్‌ఆర్‌పురంకు చెందిన వందమంది వైసీపీ కార్యకర్తలను లోకేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఏకలవ్య గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 21: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్ గురువారం వైద్య పరీక్షలను నిర్వహించారు. పాఠశాలలోని విద్యార్థులకు జ్వరం, అలర్జీ వంటి వ్యాధులతో విద్యార్థులు ఇబ్బందులు పడుతుండటంతో గురుకులంలోని 298మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు బలమైన ఆహారం పెట్టాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, విద్యార్థులు వ్యక్తి గత శుభ్రత పాటించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటశ్వేర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటీ ఢిల్లీలో పీజీ, పీహెచ్‌డీ

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)- పీజీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌కు నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్: ఇంజనీరింగ్ అనాలిసిస్ అండ్ డిజైన్
- బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయో టెక్నాలజీ: బయో మాలిక్యులర్ అండ్ బయో ప్రాసెస్ ఇంజనీరింగ్
- కెమికల్ ఇంజనీరింగ్
- కెమిస్ట్రీ: మాలిక్యులర్ ఇంజనీరింగ్, కెమికల్ సింథసిస్ అండ్ అనాలిసిస్
- సివిల్ ఇంజనీరింగ్: కన్‌స్ట్రక్షన్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, రాక్ ఇంజనీరింగ్ అండ్ అండర్ గ్రౌండ్ స్ట్రక్చర్స్, జియో టెక్నికల్ అండ్ జియో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్సెస్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్: కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ టెక్నాలజీ, కంట్రోల్ అండ్ ఆటోమేషన్, ఎలక్ట్రో సర్క్యూట్స్, పవర్ ఎలక్ట్రో - మెషిన్ డ్రైవ్స్, పవర్ సిస్టమ్స్
- ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రెన్యూవబుల్ ఎనర్జీ టెక్నాలజీస్ అండ్ మేనేజ్‌మెంట్
- మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్: మెటీరియల్స్ ఇంజనీరింగ్, పాలిమర్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- మెకానికల్ ఇంజనీరింగ్: మెకానికల్ డిజైన్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ ఇంజనీరింగ్, థర్మల్ ఇంజనీరింగ్
- ఫిజిక్స్: అప్లయిడ్ ఆప్టిక్స్, సాలిడ్ స్టేట్ మెటీరియల్స్
- టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్: ఫైబర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ కెమికల్ ప్రాసెసింగ్
- సీఏఆర్ఈ: రేడియో ఫ్రీక్వెన్సీ డిజైన్ అండ్ టెక్నాలజీ
- సీఏఎస్: అట్మాస్ఫియరిక్ ఓషనిక్ సైన్స్ అండ్ టెక్నాలజీ
- సీబీఎంఈ: బయో మెడికల్ ఇంజనీరింగ్
- సీఏఆర్‌టీ: ఎలక్ట్రిక్ మొబిలిటీ
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్: మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్

ఇంటర్ డిసిప్లినరీ ఎంటెక్ స్పెషలైజేషన్‌లు

- సైబర్ సెక్యూరిటీ, ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ, ఆప్టో ఎలక్ట్రానిక్స్ అండ్ ఆప్టో కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్, రోబోటిక్స్

ఇతర కోర్సులు

- ఎం డిజైన్: ఇండస్ట్రియల్ డిజైన్
- ఎమ్మెస్సీ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కాగ్నిటివ్ సైన్స్, ఎకనామిక్స్
- ఎంపీపీ: మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసీ
- ఎంఏ-హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్: కల్చర్, సొసైటీ, థాట్



పీహెచ్‌డీ విభాగాలు

- అప్లయిడ్ మెకానిక్స్, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేనేజ్‌మెంట్ స్టడీస్, మేథమెటిక్స్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, టెక్స్‌టైల్ అండ్ ఫైబర్ ఇంజనీరింగ్
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.50
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 4
- **వెబ్‌సైట్:** iitd.ac.in

ఎంఎస్ రీసెర్చ్ స్పెషలైజేషన్‌లు

- అప్లయిడ్ మెకానిక్స్, ఆటోమోటివ్ రీసెర్చ్ అండ్ ట్రైబాలజీ, బయో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సెన్సర్స్-ఇన్‌స్ట్రుమెంటేషన్-సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ ఇంజనీరింగ్, మెషిన్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్ టూల్స్ అండ్ టెక్నాలజీ, ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ అండ్ ఇన్‌జ్యూరీ ప్రివెన్షన్

దిక్సూచి
DIKSUCHI

ఎండీఎన్ఐవైలో యోగ కోర్సులు

కేంద్ర ఆయుష్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని మొరార్జీ దేశాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ(ఎండీఎన్ఐవై)- స్వల్పకాలిక యోగ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తారు. ఏప్రిల్ 1 నుంచి తరగతులు ప్రారంభమౌతాయి.

ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్

ప్రోగ్రామ్ వ్యవధి ఒక నెల. న్యూఢిల్లీలోని లజపత్ భవన్‌లో ఉదయం రెండు బ్యాచ్‌లు, సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొరార్జీ దేశాయ్ సంస్థలో సాయంత్రం బ్యాచ్ ఆఫ్‌లైన్ మోడ్‌లో ఉంటుంది.

అర్హత: కనీసం 15 ఏళ్లు నిండినవారం దరూ దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.3000

సర్టిఫికెట్ కోర్స్ ఇన్ యోగ ఫర్ ప్రొటోకాల్ ఇన్‌స్ట్రక్టర్

ప్రోగ్రామ్ వ్యవధి మూడు నెలలు. మొరార్జీ దేశాయ్ సంస్థలో ఉదయం రెండు బ్యాచ్‌లను ఆన్‌లైన్ విధానంలో; సాయంత్రం రెండు బ్యాచ్‌లను ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. బ్యాచ్‌కు 30 మంది అభ్యర్థులు ఉంటారు.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఫౌండేషన్ కోర్స్ ఇన్ యోగ సైన్స్ ఫర్ వెల్‌నెస్/ఒక నెల వ్యవధి గల తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** yogamdniy.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ofW28sYలో చదవండి.

ఏపీ కస్తూర్బా విద్యాలయాల్లో అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర శిక్ష పథకం కింద కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లో మొత్తం 352 విద్యాలయాలు ఉన్నాయి. ఆరోతరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి)లో చేరేందుకు బాలికలకు ప్రవేశ ప్రక్రియ నిర్వహించనున్నారు. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకోసం కూడా దరఖాస్తులు కోరుతున్నారు. అనాథలు, వీధి బాలలు, బడి మానేసిన పిల్లలు సహా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ వర్గాలకు చెందిన ఆడపిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: ఆరోతరగతిలో ప్రవేశానికి అయిదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం(పదకొండో తరగతి) ప్రవేశానికి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో ప్రవేశానికి ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు పాసై ఉండాలి. ప్రస్తుతం కేజీబీవీల్లో పదోతరగతి చదివిన బాలికలు కూడా పదకొండో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లోరూ.1,20,000; పట్టణాల్లో రూ.1,40,000 మించకూడదు.

ఎంపిక: ఆన్‌లైన్ దరఖాస్తులు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. వీటిని పరిశీలించి లిస్టు రూపొందిస్తారు. ఎంపికైనవారికి ఫోన్ ద్వారా సమాచారమిస్తారు. సంబంధిత పాఠశాల నోటీస్ బోర్డులో కూడా చూడవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 11
- **ప్రిపరేషన్ ఆఫ్ సెలెక్షన్ లిస్ట్:** ఏప్రిల్ 15న
- **సెలెక్షన్‌లిస్ట్ వెరిఫికేషన్:** ఏప్రిల్ 16 నుంచి 18 వరకు
- **వెబ్‌సైట్:** apkgbv.apcfss.in

జాబ్ కార్నర్

ఎన్‌ఎల్‌సీలో ఇండస్ట్రియల్ ట్రెయినీలు

నైవేలీ(తమిళనాడు)లోని నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్.. 239 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇండస్ట్రియల్ ట్రెయినీ/ఎస్ఎంఈ అండ్ టెక్నికల్(ఓఅండ్ఎం): **100 పోస్టులు**
2. ఇండస్ట్రియల్ ట్రెయినీ(ఫైనాన్స్ అండ్ సపోర్ట్ సర్వీసెస్): **139 పోస్టులు**

అర్హత: పదో తరగతి, ఐటీఐ, సంబంధిత ట్రేడ్‌లో డిప్లొమా

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఏప్రిల్ 19

వెబ్‌సైట్: https://www.nlcindia.in

ఓరియంటల్ ఇన్సూరెన్స్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్



న్యూఢిల్లీలోని ద ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన 100 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1)

విభాగాలు: అకౌంట్స్, అక్చూరియల్, ఇంజనీరింగ్, ఇంజనీరింగ్(ఐటీ), మెడికల్ ఆఫీసర్, లీగల్. **అర్హత:** పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/బీడీఎస్, డిగ్రీ(లా), ఐసీఏఐ/ఐసీడబ్ల్యూఏఐ/బీకాం, ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణత.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, ఒంగోలు.

దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మార్చి 21 **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 12

రాత పరీక్ష: మే/జూన్‌లో.

వెబ్‌సైట్: https://orientalinsurance.org.in/



హైదరాబాద్ షెడ్యూల్ పూర్తి

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఫాంటసీ అడ్వెంచర్ 'విశ్వంభర' షూటింగ్ శరవేగంతో హైదరాబాద్‌లో జరుగుతోంది. చిరంజీవి, హీరోయిన్ త్రిష తదితరులు పాల్గొనగా కొన్ని సీన్లు, ఓ పాట, యాక్షన్ బ్లాక్‌ను చిత్రీకరించారు. ఇవన్నీ సినిమాలో కీలక సన్నివేశాలు కావడం గమనార్హం. ఈ షెడ్యూల్ పూర్తయినట్లు గురువారం చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అలాగే చిరంజీవి నివాసంలో సంగీత దర్శకుడు కీరవాణి, దర్శకుడు వశిష్ఠ, ఛాయాగ్రాహకుడు చోటా కె నాయుడు, నిర్మాతలు వంశీ, విక్రమ్ తదితరులతో కలసి ఉన్న ఫొటోలను త్రిష సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అలాగే మరో పోస్టర్‌ను నిర్మాతలు విడుదల చేశారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రాన్ని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు, వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 10న ఈ సినిమా విడుదలవుతుంది.

కొత్త అనుభూతిని పంచే టిల్లు స్క్వేర్

యువతలో విపరీతమైన కల్ట్ ఫాలోయింగ్ సంపాదించుకున్న సినిమాలలో 'డీజే టిల్లు' ఒకటి. టిల్లుగా సిద్ధు జొన్నలగడ్డ పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' ఈ నెల 29న వస్తోంది. ఈ సందర్భంగా గురువారం చిత్ర దర్శకుడు మల్లిక్ రామ్ మీడియాతో ముచ్చటించారు.



టిల్లు స్క్వేర్ ప్రాజెక్ట్ లోకి ఎలా వచ్చారు?

డీజే టిల్లు, నేను దర్శకత్వం వహించిన 'అద్భుతం' సినిమాలు ఇంచుమించు ఒకే సమయంలో వచ్చాయి. ఆ తర్వాత నేను, సిద్ధు కలసి ఒక సినిమా చేయాలి అనుకున్నాం. అదే సమయంలో నాగవంశీ గారు 'టిల్లు స్క్వేర్' చేస్తే బాగుంటుందని చెప్పడం, డీజే టిల్లు దర్శకుడు విమల్ కృష్ణ ఇతర కమిట్‌మెంట్స్‌తో బిజీగా ఉండటంతో నేను ఈ ప్రాజెక్ట్‌లోకి వచ్చాను. మొదట కాస్త సంకోచించాను కానీ కథ బాగా వచ్చేసరికి ఇక వెనకడుగు వేయలేదు.

సినిమాలో సిద్ధు ప్రమేయం ఎంతవరకు ఉంటుంది?

సిద్ధు ఒక రచయితగా, నటుడిగా ఎంతవరకు ఇన్వాల్వ్ అవ్వాలో.. అంతవరకే ఇన్వాల్వ్ అవుతాడు. డైరెక్టర్‌కు స్వేచ్ఛను ఇస్తాడు.

టిలు స్క్వేర్ ఎలా ఉండబోతుంది?

డీజే టిల్లు, టిల్లు స్క్వేర్‌కి ఎంతో వ్యత్యాసం ఉంటుంది. డీజే టిల్లు డెడ్ బాడీ నేపథ్యంలో సాగే బ్లాక్ కామెడీ. కానీ టిల్లు స్క్వేర్ ఒక కమర్షియల్ సినిమాలా ఉంటుంది. టిల్లు పాత్ర తీరు అలాగే ఉంటుంది. రాధిక పాత్ర ప్రస్తావన ఉంటుంది. మొదటి భాగాన్ని ముడిపెడుతూ కొన్ని సన్నివేశాలు ఉంటాయి. డీజే టిల్లుని గుర్తు చేస్తూనే టిల్లు స్క్వేర్ అందరికీ కొత్త అనుభూతిని ఇస్తుంది.

అనుపమనే ఎన్నుకోవడానికి కారణం?

ఈ సినిమాలో లిల్లీ పాత్ర చాలెంజింగ్ రోల్. ఆ పాత్ర కోసం ఎందరో పేర్లను పరిశీలించాం. కానీ అనుపమనే పర్ఫెక్ట్ చాయిస్ అనిపించింది. అనుపమని బోల్డ్‌గా చూపించాలనే ఉద్దేశంతో లిల్లీ పాత్రను రాసుకోలేదు. లిల్లీ పాత్ర తీరే అలా ఉంటుంది.

రీ షూట్‌కి వెళ్ళడానికి కారణం ఏంటి?

ఇంటర్వెల్ తర్వాత ద్వితీయార్థం ప్రారంభ సన్నివేశాలు చాలా సినిమాల్లో తేలిపోతుంటాయి. ఫస్టాఫ్ బాగుంటుంది. క్లైమాక్స్ కూడా బాగుంటుంది. కానీ ఆ 15-20 నిమిషాలు ఆశించిన స్థాయిలో ఉండదు. టిల్లు స్క్వేర్ విషయంలో అలా జరగకూడదన్న ఉద్దేశంతో.. ఆ కొన్ని సన్నివేశాలు మరింత మెరుగ్గా రాసుకొని రీ షూట్ చేశాం.

విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కదా.. ఒత్తిడికి లోనయ్యారా?

ఒత్తిడి ఉండటం సహజం. కానీ కథ బాగా రాసుకోవడంతో.. చిత్రీకరణ సమయంలో పెద్దగా ఒత్తిడి అనిపించలేదు.

భూకంపం చూసి భయపడ్డా

కార్తికేయ



దర్శకుడు రాజమౌళి కుటుంబంతో కలిసి ప్రస్తుతం జపాన్‌లో పర్యటిస్తున్నారు. ఆ దేశం తరచూ భూకంపాల బారిన పడుతుందనే విషయం తెలిసిందే. గురువారం రాజమౌళి కుటుంబం ఉన్న స్టార్ హోటల్ పరిసరాల్లోనూ స్వల్పంగా భూమి కంపించింది. ఎవరికీ ప్రమాదం జరగలేదు. ఈ విషయాన్ని రాజమౌళి తనయుడు కార్తికేయ గురువారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. తన స్మార్ట్ వాచ్‌కు వచ్చిన భూకంపం హెచ్చరిక సందేశాన్ని షేర్ చేస్తూ 'హోటల్ భవనం కదులుతున్నట్లనిపించింది, అది భూకంపం వల్ల అని తెలుసుకొని భయపడ్డా' అని తెలిపారు. 'మహేశ్‌బాబు-రాజమౌళి సినిమా 'ఎస్ఎస్ఎంబీ 29 (వర్కింగ్ టైటిల్) ప్రభావం జపాన్‌లో ఎలా ఉండబోతోందో రిహార్సల్స్ చేస్తున్నారా' అని కార్తికేయను ఓ నెటిజన్ సరదాగా అడిగారు. ఆ సినిమా ప్రభావం జపాన్‌కే పరిమితం కాదు, ప్రపంచమంతా ఉంటుంది అని కార్తికేయ సినిమాపై మరింత అంచనాలు పెంచేలా బదులిచ్చారు.



పలాస కన్నా పెద్ద హిట్ అవ్వాలి

'పలాస 1978' ఫేమ్ రక్షిత్ అట్లూరి, కోమలీ ప్రసాద్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'శశివదనే'. గోదావరి నేపథ్యంలో లవ్, యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమాకు సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వం వహించారు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్ రెడ్డి గోడల నిర్మించారు. ఏప్రిల్ 19న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు సాయి మోహన్ ఉబ్బన మాట్లాడుతూ "ఇది హార్ట్ హిట్టింగ్ మూవీ. క్లైమాక్స్ ఈ సినిమాకు ప్రాణం. సినిమా ముగిశాక ప్రేక్షకులు ఎన్నో భావోద్వేగాలతో బయటికి వస్తారు" అని చెప్పారు. నిర్మాత అభిలాష్ రెడ్డి మాట్లాడుతూ "రక్షిత్ అట్లూరి, కోమలి వారి నటనతో ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లారు" అని ప్రశంసించారు. హీరో రక్షిత్ అట్లూరి మాట్లాడుతూ "పలాస' కంటే 'శశివదనే' పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను. అవుతుందని నమ్మకంగా ఉన్నాను" అని తెలిపారు. నిర్మాత అహితేజ మాట్లాడుతూ "ఈ సినిమాలో ప్రేక్షకులను అలరించే అన్ని అంశాలు ఉన్నాయి. కొత్త తరహా అనుభూతిని ఇచ్చే చిత్రమిది. క్లైమాక్స్ మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ" అని అన్నారు.

ఆయ్.. పాట విడుదలైందండీ!



నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటిస్తున్న 'ఆయ్' చిత్రంలోని 'సూఫియానా' అంటూ సాగే మెలోడీ సాంగ్‌ను తాజాగా విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాటను భరద్వాజ్, రమ్యశ్రీ పాడారు. ప్రస్తుతం సూపర్‌హిట్ సాంగ్స్‌కు కేరాఫ్‌గా మారిన రామ్ మిర్యాల ఈ చిత్రానికి సంగీత దర్శకుడు. అంజి కంచిపల్లి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. అల్లు అరవింద్ సమర్పకులు. బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మాతలు. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది.

కశ్మీర్ యాపిల్ కాదు.. మిర్చి



అప్సరారాణి ప్రధాన పాత్ర పోషించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'తలకోన'. నగేశ్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 29న సినిమా విడుదల అవుతున్న సందర్భంగా బుధవారం రాత్రి ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. ఇందులో నిర్మాత మాట్లాడుతూ 'మా హీరోయిన్ అప్సరా రాణి ఇంతవరకూ చేయని సినిమా ఇది. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో యాక్షన్ థ్రిల్లర్. అడవి అనగానే కేవలం ప్రకృతి అందాలే కాకుండా ఇంకో కోణం ఉంటుదని చూపించా' అన్నారు. 'మా హీరోయిన్ అప్సరా రాణి చూడడానికి కశ్మీర్ యాపిల్‌లా కనిపిస్తుంది కానీ ఇందులో కశ్మీర్ మిర్చిలా నటించింది. చాలా వెరైటీ స్టోరీ ఇది' అని చెప్పారు దర్శకుడు నగేశ్. ఈ సినిమాలో ఫైట్స్ కూడా చేసినట్లు అప్సరా రాణి చెప్పారు. తన కెరీర్‌లో మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Sz2IoN1 లో చదవండి.

నత్తనడకన 'నాడు-నేడు' పనులు

రెండో విడతలో 40 శాతం కూడా పూర్తికాలేదు ● మొదటి విడతలోనూ 57 పాఠశాలల్లో కొనసాగుతున్నాయి

చిత్తూరు సెంట్రల్, మార్చి 21: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెస్తాం. ప్రభుత్వ బడులు రూపురేఖలు మార్చేస్తాం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులు తీర్చిదిద్దుతాం. ఇలా గొప్పలు చెప్పుకున్న జగన్ సర్కార్.. రెండో విడత మనబడి నాడు-నేడు పనులు పూర్తి చేయడంలో ఘోరంగా విఫలమైంది. మొదటి విడత పనులు కూడా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. 40 శాతం కూడా పూర్తికాని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికి తొలుత ఇసుక సమస్య, ఆపై సిమెంట్ సరఫరాలో జాప్యం, ఫర్నిచర్ సకాలంలో అందించలేక పోవడం వంటివి కారణాలుగా కనిపిస్తున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా (చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య)లో రెండో విడత కింద 2,322 పాఠశాలల్లో రూ.788.52 కోట్ల అంచనాతో 2021 ఆగస్టులో మనబడి నాడు-నేడు పనులు ప్రారంభించారు. 2022 డిసెంబరు నాటికి పనులు పూర్తి చేసి, నూతన హంగులతో ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు అందుబాటులో తెస్తామని జగన్ ప్రభుత్వం డప్పు కొట్టింది. నిర్దేశించిన సమయానికి ప్రారంభించిన పనులు కనీసం 10 శాతం కూడా పూర్తి కాకపోవడంతో 2023 మే నెలాఖరులోపు, ఆపై సెప్టెంబరు నెలకు గడువును పొడిగించింది. అయినా 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. చివరకు 2024 జనవరి వరకు గడువు పొడిగించినా.. 40 శాతం పనులు కూడా జరగలేదు. దీనికి నిధులు సకాలంలో విడుదల చేయక పోవడమే ప్రధాన కారణమని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

నిర్మాణాలు అసంపూర్ణం : నిర్మాణాలు అసంపూర్ణంగా ఉండటంతో పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల చెట్ల కింద, వరండాల్లో ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు.

మొదటి విడతలో ఇలా.. : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మొదటి విడతలో నాడు-నేడు కింద 1,533 పాఠశాలలు రూపురేఖలు మార్చేందుకు రూ.354 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.320 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఈ విడతలో నాబార్డు నిధులతో 57 పాఠశాలల్లో చేపట్టిన పనులు ఇంకా జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.



పెనుమూరు మండలంలో..

మండలంలోని లక్కలపూడివాండ్ల ఊరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పథకం కింద రెండో విడతలో సుమారు కోటి రూపాయల పనులు ప్రారంభించారు. సిమెంట్ కొరత, నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేసినట్లు తెలిపారు.

- పెనుమూరు

ఖర్చు చేసింది 36 శాతమే..

రూ.788.25 కోట్ల అంచనాలతో పనులు ప్రారంభించినా, 2024 ఫిబ్రవరి నాటికి కేవలం రూ.280.62 కోట్లు (35.58 శాతం) మాత్రమే ఖర్చు చేశారు. చిత్తూరు జిల్లాలో 35 శాతం పనులు పూర్తవగా, 39 శాతం నిధులు ఖర్చు చేశారు. తిరుపతి జిల్లాలో 32.52 శాతం నిధులు ఖర్చు చేసినా, 30 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. అన్నమయ్య జిల్లాలో 30.19 శాతం నిధులు ఖర్చు చేసి.. 20 శాతం పనులు పూర్తి చేశారు.



నిర్మాణదశలో నిలిచిపోయిన ఆర్కేవీబీ పేట జడ్పీ హైస్కూల్ భవనం

కార్వేటినగరం మండలంలో..



అసంపూర్తిగా ఉన్న పాదిరికుప్పం జడ్పీ హైస్కూల్ భవనం

రెండో విడత పనుల వివరాలిలా..

జిల్లా పేరు	మొత్తం పాఠశాలలు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	ఇప్పటి వరకు అయిన ఖర్చు (రూ.లక్షల్లో)
చిత్తూరు	1210	424.10	165.75 (39 శాతం)
తిరుపతి	631	207.50	67.48 (32.52 శాతం)
అన్నమయ్య	478	156.92	47.38 (30.19 శాతం)
మొత్తం	2322	788.52	280.62 (35.58 శాతం)

మండలంలోని పాదిరికుప్పం, ఆర్‌కేబీవీ పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో రెండో విడతలో చేపట్టిన విద్యార్థుల తరగతి గదుల భవన నిర్మాణాలు మోల్డింగ్ వరకు జరిగాయి. నిధుల కొరత కారణంగా నిర్మాణాలు ఆగిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీనిపై ఇంజనీర్లను పలుమార్లు వివరణ కోరినా, సమాధానం చెప్పడం లేదు.

- కార్వేటినగరం

ఉద్యోగుల నిరవధిక సమ్మె వాయిదా

- మే 1 నుంచి నిరవధిక సమ్మెకు గతంలో పిలుపు
- ప్రభుత్వం గడువు కోరడంతో అంగీకరించిన జేఎఫ్ఆర్ఓపీఎస్

న్యూఢిల్లీ, మార్చి 21: పాత పింఛన్ పథకం(ఓపీఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు మే 1 నుంచి చేపడతామని ప్రకటించిన నిరవధిక సమ్మెను వాయిదా వేశారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ, కేంద్ర ఆర్థికశాఖ కార్యదర్శి టీవీ సోమనాథన్ సహా ఉన్నతస్థాయి ప్రభుత్వ అధికారులతో చర్చలు జరిపిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు జేఎఫ్ఆర్ఓపీఎస్ (ది జాయింట్ ఫోరం ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్) గురువారం వెల్లడించింది. ఓపీఎస్ పునరుద్ధరణపై నిర్ణయం తీసుకునేందుకు మరింత సమయం కావాలని ప్రభుత్వం కోరిన నేపథ్యంలో సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించామని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివగోపాల్ మిశ్రా చెప్పారు. 'రాష్ట్రాలను, వివిధ విభాగాలను సంప్రదించడానికి మరింత సమయం కావాలని వారు మాకు చెప్పారు. ఈ ప్రతిపాదనకు మేం అంగీకరించాం. అందుకే సమ్మెను వాయిదా వేయాలని నిర్ణయించాం' అన్నారు. కేంద్ర ప్రభుత్వం పింఛన్ వ్యవస్థపై సమీక్షించేందుకు సోమనాథన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కమిటీ ఉద్యోగ సంఘాల నేతలతో చర్చలు కూడా జరిపింది. కమిటీ నివేదిక సమర్పించడంలో జాప్యం గురించి కూడా జేఎఫ్ఆర్ఓపీఎస్ ప్రతినిధులకు ఆర్థిక శాఖ కార్యదర్శి వివరించారని, అయితే, ఈ అంశాన్ని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కమిటీ నిర్విరామంగా కృషి చేస్తోందని భరోసా ఇచ్చారని శివగోపాల్ మిశ్రా తెలిపారు. 'కమిటీపై నమ్మకం ఉంచాలని ఆయన మమ్మల్ని కోరారు. అలాగే, పార్లమెంటులో ప్రకటన ద్వారా కమిటీని ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ ఉద్దేశాన్ని కూడా గుర్తించాలని ఆయన కోరారు. అందుకే ప్రభుత్వానికి మరికొంత గడువు ఇవ్వాలని నిర్ణయించాం' అని మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది జూన్, జూలై నెలలతోపాటు ఈనెల 14న కూడా సోమ్‌నాథన్ కమిటీ సమావేశాలు నిర్వహించింది. కమిటీ రాష్ట్ర ప్రభుత్వాలతోనూ క్రియాశీలకంగా సంప్రదింపులు జరుపుతోందని కేంద్ర ఆర్థిక శాఖ తాజాగా జారీచేసిన ఓ సర్క్యులర్‌లో పేర్కొంది.

ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చలకు సిద్ధం

- లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

వరంగల్/చర్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో తాము శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, కానీ రాష్ట్ర ప్రభుత్వమే ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనుకూల వాతావరణం కల్పిస్తే ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో శాంతి చర్చలకు ముందుకు వస్తామని వికల్ప్ ప్రకటించారు. మావోయిస్టులతో చర్చలకు సిద్ధమని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయ్ శర్మ ప్రకటనలు చేస్తున్నారని, కానీ చర్చలపై తమ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రకటనపై నేరుగా సమాధానం ఇవ్వడం లేదని అన్నారు. ఇది కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్ర అని ఆరోపించారు. దోపిడీకి గురవుతున్న ప్రజల ప్రయోజనాల కోసం శాశ్వతంగా శాంతిని నెలకొల్పేందుకు చర్చలకు సిద్ధమని ఆయన ప్రకటించారు. సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వానికి పెద్దగా డిమాండ్లు, షరతులు పెట్టడం లేదని తెలిపారు. ఎన్‌కౌంటర్లు, క్రాస్ ఫైరింగ్‌తో ఆదివాసీలపై జరుగుతున్న దారుణహత్యలను అరికట్టాలని, సాయుధ బలగాలన్నింటినీ ఆరు నెలల పాటు శిబిరాలకే పరిమితం చేయాలని కోరారు. కొత్త క్యాంపులను ఏర్పాటు చేయటం ఆపాలన్నారు. ప్రభుత్వం అంగీకరిస్తే నేరుగా లేదా, వర్చువల్‌గా శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

కోర్టు నిబంధనలను ఉల్లంఘించలేదు

- 'రెడ్‌బుక్' కేసులో లోకేశ్ కౌంటర్

విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రెడ్‌బుక్ పేరుతో దర్యాప్తు అధికారులను బెదిరిస్తున్నారని సీఐడీ వేసిన పిటిషన్‌పై ఆయన కౌంటర్ దాఖలు చేశారు. గురువారం విజయవాడ ఏసీబీ కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే న్యాయవాది గూడపాటి లక్ష్మీనారాయణ ఈ కౌంటర్ అఫిడవిట్ వేశారు. న్యాయస్థానం విధించిన నిబంధనలను లోకేశ్ ఎక్కడా ఉల్లంఘించలేదని.. యువగళం ముగింపు సభలో ఆయన ఎలాంటి వివాదాస్పద వ్యాఖ్యలూ చేయలేదని కోర్టుకు వివరించారు. కౌంటర్‌ను స్వీకరించిన న్యాయస్థానం తదుపరి విచారణను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసులో అప్రూవర్‌గా మారిన సుధీష్ చంద్రకాంత్ షా వాంగ్మూలం నమోదును ఏసీబీ కోర్టు వచ్చే నెల 1కి వాయిదా వేసింది.

జగన్ నిర్లక్ష్యంతో ఆరోగ్య విపత్తు: ఆలపాటి

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జగన్ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో వైద్య విపత్తు తలెత్తిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. గురువారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కింద ఇంటింటికీ వైద్యం కేవలం ఎన్నికల స్టంట్‌గానే మిగిలిపోయిందన్నారు. పీహెచ్‌సీల్లో సిబ్బంది లేరని, జ్వరం బిళ్లలు కూడా దొరకడం లేదన్నారు. ప్రమాదంలో మరణించిన వారికి అందించే చంద్రన్న బీమా, మట్టి ఖర్చులను రద్దు చేశారని తెలిపారు. కరోనా మృతుల కుటుంబాలకు ఇవ్వాల్సిన నిధులనూ స్వాహా చేసిన దుర్మార్గుడు జగన్ అని విమర్శించారు.

నిరాధార ఆరోపణలతో బాబుపై పుస్తకం

- విజయబాబు, సజ్జలపై చర్యలు తీసుకోవాలి: నక్కా ఆనంద్

అమరావతి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రజాధనంతో జీతం తీసుకుంటున్న అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు.. చంద్రబాబుపై అసత్య ఆరోపణలతో పుస్తకం రాయడం, దాన్ని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి విడుదల చేయడం సిగ్గుచేటని మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు గురువారం విమర్శించారు. చంద్రబాబుపై నిరాధార నిందలతో పుస్తకం రాయడంపై మండిపడ్డారు. రూ.లక్ష కోట్లు దోపిడీ చేసి కిరాయి మనుషులతో చంద్రబాబుపై జగన్ అసత్య ప్రచారం చేయిస్తున్నారని, ఎన్నికల నియమావళిని ధిక్కరిస్తూ ప్రతిపక్ష నేతపై అసత్య ఆరోపణలు చేసినందుకు వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. వారి ప్రభుత్వ పదవులను వెంటనే తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. దేశంలో అవినీతికి పాల్పడిన ముఖ్యమంత్రుల ఫోటోలను పుస్తకంలో ప్రచురించిన విజయబాబు రూ.43 వేల కోట్లు దోపిడీ చేసి, 16 నెలలు జైల్లో ఉన్న జగన్ ఫొటోను, దోపిడీలకు సహకరించిన జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫొటోను వేయడం మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఎన్నికల నియమావళిని ధిక్కరించిన విజయ్‌బాబు, సజ్జలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

పేదలకు డొక్కు బస్సులే!

జగన్‌కు మాత్రం అధునాతన హంగులతో కొత్త వాహనాలు

- రూ.25 లక్షల పల్లె వెలుగుకు డబ్బుల్లేవ్
- సీఎం కోసమేమో 35 కోట్లతో 5 బస్సులు
- ఐదేళ్లలో ఒక్క కొత్త బస్సూ కొనని ఆర్టీసీ
- పనికిమాలిన వాటిలోనే జనం ప్రయాణం
- కొత్త బస్సులు 1,500 వస్తాయంటూ ఏడాదిగా చెబుతున్న ఎండీ, చైర్మన్
- ఒక్కదానికీ అతీగతీ లేదు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదల ప్రభుత్వమంటూ గొప్పలు చెబుతారు.. పేదోడు ప్రయాణించే ఆర్టీసీ బస్సు చార్జీలు పెంచుతారు.. డొక్కు బస్సులు మార్చరు.. కొత్త బస్సులు కొనరు.. కనీసం పాతవాటికి మరమ్మతులు కూడా సరిగా చేయరు.. కానీ పేదల పక్షపాతి సీఎం కోసం కోట్లాది రూపాయల ఖర్చుతో అత్యాధునిక వసతులతో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొంటారు. గత ఐదేళ్లలో పేదలు ప్రయాణించే పల్లె వెలుగు బస్సు ఒక్కటి కూడా కొనుగోలు చేయని సీఎం జగన్మోహన్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారం కోసం రూ.35 కోట్ల వ్యయంతో ఏపీఎస్ఆర్టీసీతో ఐదు బస్సులు కొనుగోలు చేయించారు. అందులో రెండు బుల్లెట్ ప్రూఫ్ కాగా మరో మూడు ఆయన సేద తీరేందుకు క్యారవాన్లు.. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయాణ అవసరాలు తీర్చి గమ్యం చేర్చే ప్రజా రవాణా సంస్థకు ఉన్న బస్సుల్లో 53 శాతం కాలం చెల్లినవే. గతంలో ఏ ప్రభుత్వమూ పెంచనంతగా ప్రయాణ చార్జీలు పెంచి ఏడాదికి రెండు వేల కోట్ల భారం మోపిన జగన్.. ఈ ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క కొత్త బస్సు కూడా కొనుగోలు చేయలేదు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఎండీ ద్వారకా తిరుమలరావు కొత్త బస్సులు అవిగో ఇవిగో అని చెబుతూ వచ్చారు. ఇప్పటికే 1,500 బస్సులు కొన్నామని.. వాటికి బాడీ నిర్మాణం పూర్తయ్యాక జనవరిలో రోడ్డెక్కుతాయని పలు మార్లు చెప్పారు. జనవరి కాదు కదా మార్చి వెళ్లిపోతున్నా అతీగతీ లేదు. ఒక్కో పల్లెవెలుగు బస్సును కేవలం రూ.25 లక్షలతో కొనుగోలు చేయవచ్చని చెబుతున్నారు.

సీఎంవో ఆదేశాలు రాగానే..

ఎన్నికల ప్రచారాన్ని దృష్టిలో పెట్టుకుని మూడు నెలల క్రితం ముఖ్యమంత్రికి మూడు బస్సులు కొనుగోలు చేయాలంటూ ఆర్టీసీకి ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలొచ్చాయి. వెంటనే ఎండీ ద్వారకాతిరుమల రావు చండీగఢ్ వెళ్లి రూ.15 కోట్ల ఖర్చుతో మూడు క్యారవాన్ బస్సులకు ఆర్డర్ ఇచ్చి వచ్చారు. అంతలోనే మరో రెండు బుల్లెట్ ప్రూఫ్ వోల్వో బస్సులు కావాలని చెప్పడంతో నిఘా విభాగం ఉన్నతాధికారులతో చర్చించి ఏకంగా 20 కోట్లు ఖర్చు చేసి వాటిని కొన్నారు. జనవరిలో ఆర్డర్ ఇచ్చిన బస్సులు కేవలం రెండు నెలల్లో అత్యాధునిక హంగులతో విజయవాడ చేరుకున్నాయి. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై చార్జీల బాదుడుతో వసూలు చేసిన సొమ్మును వీటికి వ్యయం చేశారన్న మాట. బుల్లెట్ ప్రూఫ్ బస్సులు కొనడంపై నిరసన వెల్లువెత్తడంతో వాటిని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా కోసం కొనుగోలు చేయించినట్టుగా వైసీపీ పేటీఎం బ్యాచ్ ప్రచారం చేసింది. కానీ ప్రధాని మోదీ చిలకలూరిపేటకు వచ్చినప్పుడు ఆ బస్సు విజయవాడ దాటి వెళ్లలేదు. ముఖ్యమంత్రి పర్యటనలు, బహిరంగ సభల ఏర్పాట్లను పర్యవేక్షించే వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం ప్రస్తుతం ఈ బస్సులను పర్యవేక్షిస్తున్నారు. బుల్లెట్ ప్రూఫ్ బస్సుల్లో బెడ్‌రూమ్, టాయ్‌లెట్స్, మినీ కాన్ఫరెన్స్ హాల్, ఎల్ఈడీ టీవీ, వైఫై, మినీ ఆఫీసు, సీసీ కెమెరాలు, బస్సు చుట్టూ సౌండ్ సిస్టమ్, జగన్ బస్సు పైకి ఎక్కటానికి వీలుగా స్టెయిర్స్, బస్సెక్కిన తర్వాత ప్రసంగించడానికి మినీ డయాస్ వంటివి ఉన్నాయి.


బుల్లెట్ ప్రూఫ్ బస్

ఆ రెంటినీ వాడకుండా..

ఆర్టీసీ వద్ద ఇప్పటికే రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఉన్నా వాటిని ముఖ్యమంత్రి జగన్ పక్కన పెట్టేశారు. ఇటీవల వాటికి మూడున్నర కోట్లతో మరమ్మతులు కూడా చేయించారు. అయినప్పటికీ వాటిని వాడేందుకు జగన్ నిరాకరించడంతో 38 కోట్లు వెచ్చించి మరీ ఐదు కొత్త బస్సులను కొనుగోలు చేశారు. వోల్వో బుల్లెట్ ప్రూఫ్ బస్సులు బయట అద్దెకు తీసుకోవాలంటే ప్రభుత్వం మీద చాలా భారం పడుతుంది. అదే ఆర్టీసీ వద్దయితే తక్కువ అద్దె ఇవ్వొచ్చని వైసీపీ పెద్దలు భావించినట్లు ఉన్నారు. అందుకే దానితో కొనుగోలు చేయించారు. అందుబాటులో ఉన్న వాటినే వాడి ఉంటే ఆర్టీసీపై భారం తగ్గేది. కనీసం వంద పల్లె వెలుగు బస్సులు వచ్చినా కొన్ని పాత డొక్కు బస్సులను పక్కనపెట్టేయడానికి అవకాశం ఉండేది.

ఇతర విరాళాల్లోనూ

బీజేపీనే టాప్

న్యూఢిల్లీ, మార్చి 21: ఎన్నికల బాండ్ల రూపంలో కాకుండా.. దేశవ్యాప్తంగా వివిధ పార్టీలకు 2013-2023 నడుమ అందిన నిధులు రూ.7,726 కోట్లు. అందులో సింహభాగం.. దాదాపు రూ.5000 కోట్లు (ఇంచుమించుగా 64.7%) బీజేపీకే అందాయని ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా సమాచారం ఆధారంగా బిజినెస్‌లైన్ వార్తా సంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం.. 10.7% నిధులతో కాంగ్రెస్.. 3.3% నిధులతో బీఆర్ఎస్, 3.1% నిధులతో ఆప్ బీజేపీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మోదీ సర్కారు రూపొందించిన ఎలక్టోరల్ బాండ్ల పథకం 2018లో అమల్లోకి వచ్చిన సంగతి తెలిసిందే. అంతకు ముందున్న విధానంలో.. రూ.20 వేల కంటే ఎక్కువ మొత్తంలో వచ్చే విరాళాల వివరాలను పార్టీలు ప్రకటించాల్సి ఉంటుంది. 2014 నాటికి ఇలాంటి విరాళాల విలువ రూ.309 కోట్లుగా ఉండగా.. 2020 నాటికి రూ.1,247 కోట్లకు చేరింది. 2023లో అలాంటి విరాళాలు రూ.1,101 కోట్లకు తగ్గడం గమనార్హం.

బాండ్లు.. అతి పెద్ద స్కాం: ఏచూరి

న్యూఢిల్లీ, మార్చి 21: దేశ చరిత్రలో ఎలక్టోరల్ బాండ్ల స్కీం అతి పెద్ద కుంభకోణమని.. ఇది మాఫియా తరహా దోపిడీలకు దారితీసిందని సీపీఎం నేత సీతారాం ఏచూరి అన్నారు. ఎలక్టోరల్ బాండ్లను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన వారిలో ఏచూరి కూడా ఉన్నారు. తాజాగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు.. 'నల్లధనాన్ని అరికట్టడానికి బదులుగా మనీ లాండరింగ్‌కు అనుమతిస్తున్నారు. చాలా కంపెనీలు తమ వార్షిక లాభాల కంటే అనేక రెట్లు ఎక్కువగా ఎలక్టోరల్ బాండ్లు కొనుగోలు చేశాయి. సుప్రీం కోర్టు ఈ బాండ్ల విధానాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. కార్పొరేట్ కంపెనీలు నేరుగా పార్టీలకు నిధులివ్వకూడదు. ప్రభుత్వానికి ఆ నిధులు అందజేస్తే.. ఎన్నికల కోసం వాటిని ఖర్చుచేస్తే బాగుంటుంది. అధికార బీజేపీ చర్యలు దేశంలో దారుణమైన రాజకీయ అవినీతికి దోహదం చేస్తున్నాయి' అని మండిపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే ఇంట్లో దోపిడీ

- ఎన్నికల ప్రచారానికి వెళ్లిన తైనాల విజయ్‌కుమార్
- ఇంట్లో ఒంటరిగా ఉన్న భార్య
- రాత్రి ఏడున్నరకు గేటు దూకి చొరబడిన దుండగుడు
- మెడపై కత్తిపెట్టి బెదిరింపు
- నగదు, బంగారంతో ఉడాయింపు
- వెంటనే భర్తకు ఫోన్ చేసిన బాధితురాలు
- ప్రచార హోరులో ఫోన్ ఎత్తని వైసీపీ నాయకుడు
- డ్రైవర్‌కు ఫోన్ చేసి చెప్పగా.. ఇంటికి

విశాఖపట్నం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్ ఇంట్లో దోపిడీ జరిగింది. విశాఖ నగరంలోని డాబాగార్డెన్స్‌లో గల లలితా కాలనీలో గురువారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. విజయ్‌కుమార్ ఎన్నికల ప్రచారానికి ఎస్.కోటకు వెళ్లగా, ఇంట్లో భార్య ఒక్కరే ఉన్నప్పుడు ఈ దోపిడీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయ్‌కుమార్ దంపతులకు ఇద్దరు సంతానం. ఇద్దరు కుమారులు ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడగా, విజయ్‌కుమార్ దంపతులు లలితా కాలనీలో నివాసం ఉంటున్నారు. ఎస్.కోట నియోజకవర్గానికి విజయ్‌కుమార్ పరిశీలకుడు. దీంతో ఆయన అక్కడ ప్రచారంలో పాల్గొంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఎంపీ అభ్యర్థిని బొత్స ఝాన్సీలక్ష్మి పర్యటన ఉండడంతో ఆయన అక్కడకు వెళ్లారు. భార్య ఇంట్లో ఒంటరిగా ఉండగా, రాత్రి ఏడున్నర గంటల సమయంలో ముఖానికి మాస్క్‌తోపాటు నెత్తిన టోపీ పెట్టుకున్న దుండగుడు ప్రహరీ దూకి లోనికి చొరబడ్డాడు. కిచెన్‌లోకి వెళ్లి అక్కడ వంట చేస్తున్న విజయ్‌కుమార్ భార్య మెడపై కత్తి పెట్టి చంపేస్తానని బెదిరించాడు. మెడలోని బంగారం తాడు, గొలుసు తీసుకున్నాడు. అనంతరం బీరువాలోని నగదు, బంగారం కూడా తీసుకుని ఉడాయించాడు. ఆమె వెంటనే భర్తకు ఫోన్ చేయగా ప్రచారం హోరులో విజయ్‌కుమార్ ఫోన్ తీయలేదు. దీంతో కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పడంతో విజయ్‌కుమార్ వెంటనే ఇంటికి చేరుకున్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. డీసీపీ-1 మణికంఠ చందోలు, క్రైమ్ డీసీపీ వెంకటరత్నం, సీసీఎస్ ఏసీపీ ఎ.వెంకటరావు, టూటౌన్ సీఐ తిరుమలరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

తెలిసిన వారి పనేనని అనుమానం

ఇది తెలిసినవారి పనే అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. విజయ్‌కుమార్ ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనం తర్వాత ఎస్.కోట వెళుతున్నారని, ఆ సమయంలో భార్య ఒంటరిగా ఉంటున్నట్టు గమనించిన వ్యక్తులే దోపిడీకి వ్యూహం పన్ని ఉంటారని భావిస్తున్నారు. దుండగుడు తెలుగులో స్పష్టంగా మాట్లాడాడని, మధ్యలో ఎవరో ఫోన్ చేయగా.. పనైపోయింది వచ్చేస్తానని చెప్పాడని విజయ్‌కుమార్ భార్య పోలీసులకు తెలిపారు. విజయ్‌కుమార్ ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలతోపాటు ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు పరిశీలించారు. ఇంటి బయట ఒకరు ద్విచక్ర వాహనంపై వేచి ఉండగా, ఒకరు ఇంట్లోకి ప్రవేశించినట్టు సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో దోపిడీలో ఇద్దరి పాత్ర ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఆ ఇద్దరూ స్థానికులే అయి ఉంటారని అనుమానిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజీ, సెల్‌ఫోన్ టవర్ లొకేషన్, ఘటనా స్థలంలో లభ్యమైన వేలిముద్రల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కోడ్ వచ్చిన రోజే 'మైపాడు' ప్రైవేటుకు

- రహస్యంగా బీచ్ రిసార్ట్ ఐదేళ్లు లీజుకు.. 'ఆంధ్రజ్యోతి' చేతికి చిక్కిన ఆధారం

విజయవాడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణ అంశంపై హైకోర్టులో కేసు విచారణ జరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ ఉన్నతాధికారులకు ఇవేవీ పట్టడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక యూనిట్లను కారుచౌకగా ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు రంగం సిద్ధం చేసిన ఏపీటీడీసీ ఉన్నతాధికారులు.. తాజాగా నెల్లూరు జిల్లాలోని మైపాడు బీచ్ రిసార్ట్‌ను ప్రైవేటు సంస్థకు కట్టబెట్టారు. సరిగ్గా కోడ్ అమల్లోకి వచ్చిన రోజునే దీనిని అప్పగించారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఆఫ్ హోమ్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ అనే సంస్థకు ఐదేళ్ల కాలానికి లీజుకు ఇచ్చేశారు. పర్యాటక యూనిట్ల ప్రైవేటీకరణకు సంబంధించి పర్యాటకశాఖ ఉద్యోగుల సంఘం నేతలు కొందరు ఇటీవలే హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు విచారణలో ఉంది. ప్రైవేటీకరణ అంశాలతో పాటు ఇతర ఆరోపణలపైనా రెండు వారాల్లో కౌంటర్ వేయాలని కోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఏపీటీడీసీ అధికారులు ప్రైవేటీకరణ చర్యలు మానటం లేదు. రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక యూనిట్ల ద్వారా వస్తున్న వాస్తవ ఆదాయం కంటే కూడా కారు చౌకగా లీజుకు ఇవ్వాలని నిర్ణయించటంపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ప్రైవేటీకరణ పేరుతో సొంత మనుషులకు పర్యాటక యూనిట్లను కట్టబెట్టేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. అస్మదీయ సంస్థలకు అవకాశం కల్పించటం వల్ల ఉన్నతాధికారులకు ఆదాయంలో వాటాలు ఇవ్వబోతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో మైపాడు బీచ్ రిసార్ట్‌ను ప్రైవేటు సంస్థ చేతిలో పెట్టేశారు. ఈ వ్యవహారంలో భారీ ఎత్తున ముడుపుల పర్వం నడిచిందన్న ఆరోపణలు వస్తున్నాయి.


ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన రోజున నెల్లూరు జిల్లా మైపాడు బీచ్ రిసార్ట్‌ను ప్రైవేటుకు అప్పగించిన దానికి సాక్ష్యం ఇదే

కథ అడ్డం తిరిగింది

రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక యూనిట్ల రెన్నోవేషన్ పనులకు పిలిచిన టెండర్లను కోడ్ నేపథ్యంలో పాత తేదీలతో ఖరారు చేసి వర్క్ ఆర్డర్స్ ఇచ్చేందుకు బుధవారం విజయవాడలో ఏపీటీఏ కార్యాలయంలో ఉన్నతాధికారులు రహస్యంగా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. మీటింగ్ విషయం 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో రావటంతో ఏపీటీడీసీ ఉద్యోగులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. పర్యాటక యూనిట్లను తనఖా పెట్టి రుణంగా తీసుకున్న డబ్బుతో ఈ పనులు చేయిస్తున్నట్టుగా ఉన్నతాధికారులు కాంట్రాక్టర్లను ఊరించారు. ముందుగా కమీషన్లు తీసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. పాత తేదీలతో అగ్రిమెంట్లు చేసుకుందామని, పాత తేదీలతో వర్క్ ఆర్డర్స్ ఇస్తామని,కమీషన్లు ఇచ్చేసి పనులు మొదలు పెట్టుకోమని చెప్పినట్టుగా గుప్పుమంది. అయితే రామవరప్పాడు ఎస్‌బీఐ బ్రాంచి ఇంకా రుణం సర్దుబాటు చేయలేదని సమాచారం. ఈ విషయం కాంట్రాక్టర్లకు ముందుగా తెలియకపోవడంతో సమావేశంలోనే కమీషన్లు ఇచ్చేందుకు డబ్బుల మూటలు తీసుకువచ్చారు. బుధవారం నాటి సమావేశంలో పనులకు బిల్లుల చెల్లింపు అంశాలకు సంబంధించి కొన్ని అస్పష్టతలు ఉండటంతో కాంట్రాక్టర్లు కమీషన్ల డబ్బులను బయటకు తీయలేదని సమాచారం. గురువారం బ్యాంకు నుంచి రుణమే రాలేదని పలువురు కాంట్రాక్టర్లు తెలుసుకున్నారు. కమీషన్లు ఇచ్చేస్తే ఆ తర్వాత బిల్లులు రాక నష్టపోతామని, ప్రభుత్వం మారితే విజిలెన్స్ విచారణ ఎదుర్కోవాల్సి వస్తుందని కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. పలువురు కాంట్రాక్టర్లు గురువారం విజయవాడలో భేటీ అయ్యారు. ఉన్నతాధికారులు కమీషన్ల కోసం ఒత్తిడి తెస్తున్నారని, మనమే ఇబ్బందులు పడతామని, ఎన్నికలయ్యే వరకు ఓపిక పట్టాలని నిర్ణయించినట్టుగా తెలిసింది.

సంక్షేమం.. అభివృద్ధి

చంద్రబాబుకే సాధ్యం

- మాజీ ఎంపీ మురళీమోహన్
- హోరెత్తిన ప్రజాగళం.. పాట విడుదల

హైదరాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో కొనసాగించడం టీడీపీ అధినేత, చంద్రబాబుకే సాధ్యమని మాజీ ఎంపీ మాగుంట మురళీమోహన్ స్పష్టం చేశారు. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు మరోసారి రావాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. పొట్లూరి శ్రీనివాస్‌రావు నిర్మాణంలో రచయిత, డైరెక్టర్ కోనేరు ప్రదీప్‌కుమార్ రూపొందించిన 'హోరెత్తిన ప్రజాగళం" పాటను గురువారం, ఎన్టీఆర్‌భవన్‌లో మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఐదు సంవత్సరాలుగా రాష్ట్రం వెనుకబడిపోయిందని, రాజధాని లేని దిక్కులేని రాష్ట్రంగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ టి.డి.జనార్ధన్ మాట్లాడుతూ... ఐదేళ్లుగా ఏపీలో అరాచకమైన, ప్రజాకంటకమైన పాలన జరుగుతోందన్నారు. ది బోస్టన్ గ్రూప్ ఛైర్మెన్, సుబ్బు ఎం. కోట మాట్లాడుతూ... అమెరికాలోని ప్రవాసాంధ్రుల యువత అందరూ జనసేనకు మద్దతు తెలుపుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ రాబోయే ఎన్నికలలో గెలవాలన్నదే మా డ్రీమ్ అన్నారు. రోడియం గ్రూప్‌ఆఫ్ కంపెనీస్ ఛైర్మెన్, పొట్లూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ... ఏపీలో మళ్లీ మంచి రోజులు వచ్చి చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయాలని అందరూ కంకణం కట్టుకున్నారన్నారు. ఎండి బిఎస్‌సిపిఎల్, బొల్లినేని శీనయ్య, పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ప్రొఫెసర్ జ్యోత్స్న, మీడియా కమిటీ ఛైర్మన్ తెలుగు దేశం ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నై సౌత్ బరిలో తమిళిసై

- 9 మంది అభ్యర్థులతో బీజేపీ మూడో జాబితా
- ఇప్పటి వరకు 275 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన



న్యూఢిల్లీ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికలో మిగిలిన పార్టీలతో పోలిస్తే బీజేపీ ఒకడుగు ముందే ఉంటోంది. కాంగ్రెస్ కంటే ముందే రెండు జాబితాలను ప్రకటించిన బీజేపీ, గురువారం 9 మంది అభ్యర్థులతో మూడో జాబితాను విడుదల చేసింది. ఈ తొమ్మిది స్థానాలూ తమిళనాడులోనివే. ఈనెల 19న తెలంగాణ గవర్నర్ పదవితోపాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందర రాజన్‌కు చెన్నై సౌత్ లోక్‌సభ సీటును కేటాయించారు. గవర్నర్ పదవికి రాజీనామా చేసిన రెండు రోజులకే ఆమెకు లోక్‌సభ సీటును కేటాయించడం గమనార్హం. ఇక తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలైకు కోయంబత్తూర్, కేంద్ర మంత్రి ఎల్.మురుగన్‌కు నీలగిరి(ఎస్సీ), కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్‌కు కన్యాకుమారి స్థానాలు కేటాయించారు. అదేవిధంగా.. చెన్నై సెంట్రల్ నుంచి వినోజ్ పీ సెల్వమ్, వెల్లూర్ నుంచి ఏసీ షణ్ముగం, కృష్ణగిరి నుంచి సి. నరసింహన్, పెరంబలూర్ నుంచి టీఆర్ పారివేందర్, తూత్తుకుడి నుంచి నైనార్ నాగేంద్రన్ లోక్‌సభకు పోటీ చేయనున్నారు. కాగా, బీజేపీ తొలి జాబితాలో 194 మంది, రెండో జాబితాలో 72 మంది పేర్లను ప్రకటించింది. మూడు జాబితాల్లో కలిపి ఇప్పటి వరకు 275 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఆ పార్టీ ప్రకటించింది. మరో 268 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. కాగా, కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు రెండు జాబితాల్లో కలిపి 82 స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. వాటిలో 15 స్థానాలకు బీజేపీ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించేసింది. నాలుగో జాబితాలో ఖమ్మం, వరంగల్ లోక్‌సభ స్థానాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన లోక్‌సభ స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉంది.

అమెరికన్లది జగమంత కుటుంబం!

- ఆ దేశంలోని పలు కుటుంబాల్లో.. ఎవరికి ఎవరు ఏమవుతారో తెలియని గందరగోళం

న్యూఢిల్లీ, మార్చి 21 : అమెరికాలోని కొన్ని కుటుంబాల్లోని సభ్యులు ఎవరికి ఎవరు ఏమవుతారు అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితులు ఉన్నాయట. డీఎన్ఏ పరీక్షల్లో బయటపడుతున్న విషయాలు భయపెడుతున్నాయి. పీకల్లోతు ప్రేమలో ఉన్న ఓ జంట డీఎన్ఏ పరీక్షలు చేయించుకుంటే వారు అన్నాచెల్లెళ్లుగా తేలుతున్నారు. చిన్నప్పటి నుంచి నాన్న అని పిలుచుకున్న వ్యక్తి తమ కన్నతండ్రి కాదని తెలుసుకుని మరికొందరు ముక్కున వేలేసుకుంటున్నారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా చేసిన ఓ అధ్యయనంలో ఈ విషయాలు వెలుగు చూశాయి. అక్కడ మితిమీరిన స్వేచ్ఛాయుత జీవన విధానం వల్ల వావివరసలు తెలుసుకోకుండా పలువురు లైంగిక సంబంధాలు పెట్టుకోవడమే ఇందుకు కారణం.

ఇలాంటి సంబంధాల కారణంగా కొందరు తమ సమీప రక్తసంబంధీకులకే పుట్టారనే విషయం డీఎన్ఏ పరీక్షల్లో బయటపడుతుంది. 1975లో ఓ సైకాలజీ పుస్తకంలో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం ఇలాంటి సంబంధం వల్ల పుట్టిన వారు అమెరికాలోని ప్రతి పది లక్షల మందిలో ఒకరు ఉండేవారు. ఇటీవల చేసిన అధ్యయనాల్లో ప్రతీ ఏడు వేల మందిలో ఒకరు ఉండడం ఆందోళన కలిగించే అంశం. తను, తన మాజీ ప్రియుడు వరసకు అన్నాచెల్లెళ్లు అవుతామనే విషయాన్ని డీఎన్ఏ పరీక్షల ద్వారా తెలుసుకున్నామని అమెరికాకు చెందిన విక్టోరియాహిల్(39) అనే మహిళ సీఎన్ఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొంది. అంతేకాక, తాను నాన్న అని పిలుచుకుంటున్న వ్యక్తి తన కన్నతండ్రి కాదని కూడా తెలిసిందని ఆమె వెల్లడించింది. అయితే, కొందరు వ్యక్తులు చేస్తున్న వీర్య దానాలూ ఈ సమస్యకు ఓ కారణమనే అభిప్రాయాలు ఉన్నాయి.

ఆంధ్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జిగా అరుణ్‌సింగ్

న్యూఢిల్లీ, మార్చి 21: ఆంధ్ర సహా మూడు రాష్ట్రాలకు ఎన్నికల ఇన్‌చార్జులను, సహ ఇన్‌చార్జులను బీజేపీ నాయకత్వం నియమించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జిగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్‌సింగ్, సహ ఇన్‌చార్జిగా యూపీ మాజీ మంత్రి సిద్ధార్థనాథ్ సింగ్ రానున్నారు. రాజస్థాన్ ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ వినయ్ సహస్రబుద్ధే, కో-ఇన్‌చార్జులుగా జాతీయ కార్యదర్శి విజయ్ రాహత్కర్, పశ్చిమ ఢిల్లీ ఎంపీ పర్వేశ్ సాహిబ్‌సింగ్ వర్మ.. హరియాణా ఇన్‌చార్జిగా రాజస్థాన్ బీజేపీ సీనియర్ నేత సతీశ్ పూనియా, సహ ఇన్‌చార్జిగా యూపీ ఎంపీ సురేంద్రసింగ్ నాగర్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

జగన్.. నా అంటే నాశనమే: పిల్లి

అమరావతి, మార్చి21(ఆంధ్రజ్యోతి): నా.. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు అనే జగన్‌రెడ్డి ఈ పదేళ్లలో ఆ వర్గాలకు అందాల్సిన రూ.1.30లక్షల కోట్లు దారి మళ్లించారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పిల్లి మాణిక్యాలరావు ఆరోపించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగన్ నా అంటే.. నాశనమే అని అభివర్ణించారు. 'నా బాబాయ్ అని వివేకాను చంపేశారు. నా తల్లి, నా చెల్లి అని వాళ్లనూ తరిమేశాడు' అని విమర్శించారు.

టీడీపీ నేతల ఇళ్లు.. ఆఫీసులూ ధ్వంసం చేస్తాం

- ప్రత్తిపాడు వైసీపీ అభ్యర్థి కిరణ్

అమరావతి, మార్చి21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులు తమ అనుచరులపై దాడి చేశారంటూ గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అమరావతి సచివాలయంలోని సీఈవో కార్యాలయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. 'టీడీపీ వాళ్లు మావాళ్లపై దాడులకు పాల్పడుతున్నారు. టీడీపీ ఇలాగే చేస్తే, రానున్న రోజుల్లో మీ ఇళ్లే కాదు.. పార్టీ ఆఫీసులను కూడా ధ్వంసం చేస్తాం. జాగ్రత్తగా ఉండండి' అని హెచ్చరించారు. చంద్రబాబు గూండాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మరో నాయకుడు నారాయణమూర్తి మాట్లాడుతూ రాయచోటిలో నారా భువనేశ్వరి చెక్కుల రూపంలో డబ్బులు పంపిణీ చేసి, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని సీఈవోకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

2050 కల్లా భారత్‌లో పడిపోనున్న జననాల రేటు

- 1.29కి చేరుకునే అవకాశాలు..ప్రస్తుతం 2.1గా టీఎఫ్ఆర్
- వెల్లడించిన అధ్యయనం.. లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితం

న్యూఢిల్లీ, మార్చి 21: భారత్‌లో జననాల రేటు 2050 కల్లా భారీగా తగ్గిపోనుందని లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం వెల్లడించింది. ప్రస్తుతం (2021 అంచనాల ప్రకారం) భారత్‌లో టోటల్ ఫెర్టిలిటీ రేట్(టీఎఫ్ఆర్) 2.1గా ఉంది. ఈ రేటు 2050 కల్లా 1.29కి పడిపోయే ప్రమాదముందని ఈ అధ్యయనం స్పష్టం చేసింది. 1950లో 6.18గా ఉన్న టీఎఫ్ఆర్ 1980కి 4.6కి చేరుకుందని, 2021లో 2.1కి దిగజారిందని గుర్తుచేసింది. ఇందుకు అనేక కారణాలున్నాయని పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పూనమ్ ముత్రేజా వెల్లడించారు. "జీవన ప్రమాణాలు, పిల్లల పెంపకం భారం, విద్యపై వ్యయం పెరిగాయి. మహిళల్లో సాధికారతపై అవగాహన పెరిగింది. తమ కాళ్లపై తాము నిలదొక్కుకున్నాకే పెళ్లిళ్ల గురించి ఆలోచిస్తున్నారు. కెరీర్‌లో ఎదుగుదల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ పరిణామాలన్నీ టీఎఫ్ఆర్ తగ్గడానికి కారణమవుతోంది" అని ఆమె వివరించారు. టీఎఫ్ఆర్ తగ్గడంపై ప్రతికూల ప్రభావాలు కూడా ఉంటాయని చెప్పారు. "రాబోయే రోజుల్లో జననాల రేటు తగ్గడంతో వృద్ధుల సంఖ్య పెరుగుతుంది. కార్మికుల/లేబర్ సంఖ్య తగ్గుతుంది. లింగపరంగా సామాజిక అసమానతలు పెరిగిపోతాయి" అని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా.. 204 దేశాల్లో నిర్వహించిన ఈ అధ్యయనంలో.. 2050 సంవత్సరం వరకు 155 దేశాల్లో ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడైంది.

హేమంత్ సొరేన్ కస్టడీ ఏప్రిల్ 4 వరకు పొడిగింపు

రాంచీ, మార్చి 21: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరేన్ జ్యుడీషియల్ కస్టడీని ఏప్రిల్ నాలుగో తేదీ వరకు పొడిగిస్తూ ఇక్కడి పీఎల్ఎంఏ ప్రత్యేక కోర్టు ఆదేశాలు ఇచ్చింది. తొలుత ఆయనకు ఇచ్చిన కస్టడీ సమయం గురువారంతో ముగిసింది. ఈడీ వినతి మేరకు కస్టడీని పొడిగిస్తున్నట్టు జడ్జి ప్రకటించారు.